VISION BHARATH REPORTER
విభారె
VIBHARE TELUGU DAILY
విలేఖరులు కావలెను
గత ఐదు సంవత్సరాల నుండి నిరంతరాయంగా వెలువడుతున్న
'విభారె' తెలుగు దినపత్రికకు
ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ లోని అన్ని జిల్లా కేంద్రాలో
బ్యూరోలు మరియు స్టాఫ్ రిపోర్టర్లు కావలెను.
కర్నూలు జిల్లాలోని అన్ని నియోజకవర్గ మరియు
మండలాల వారీగా విలేఖరులు కావలెను
ఆవుల విజయభాస్కర్ రెడ్డి
ఎడిటర్ అండ్ పబ్లిషర్,
8143193697, 9440232308

www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY

ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
ఆవుల విజయభాస్కర రెడ్డి B.A., L.L.B
ఆళ్లగడ్డ
9440232308,9494498787

PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర్ రెడ్డి ఆదివారం 09-04-2023 సంపుటి: 04 సంచిక: 194 పేజీలు: 4 వెల: రూ 3-00

## సికింద్రాబాద్ - తిరుపతి వందేభారత్ రైలును ప్రారంభించిన మోదీ



హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల మధ్య మరో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలెక్కింది. సికింద్రాబాద్ – తిరుపతి మధ్య నడవనున్న ఈ సెమీ హైస్పీడ్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను శనివారం ప్రధాని నరేంద్రమోదీ 10వ నంబర్ ప్లాట్‌ఫాంపై జెండా ఊపి ప్రారంభించారు.ప్రారంభోత్సవంలో రైల్వే శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్, గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఉన్నారు.ఈ రైలులో కొంతమంది విద్యార్థులు నల్గొండ వరకు ప్రయాణిస్తున్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్న ప్రధాని.. నేరుగా వందేభారత్ రైలు ఎక్కారు. అక్కడ ఉన్న విద్యార్థులతో కాసేపు ఆత్మీయంగా ముచ్చటించారు. అనంతరం జెండా ఊపి రైలును ప్రారంభించారు. ప్రారంభోత్సవం అనంతరం చేర్యాల పెయింటింగ్‌ను రైల్వే శాఖ మంత్రి ప్రధానికి అందించారు.అంతకుముందు ఉదయం 11.30 గంటలకు ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్న ప్రధాని మోదీకి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, ఎంపీ లక్ష్మణ్, ఎమ్మెల్యే ఈటల రాజేందర్, రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, సీఎస్ శాంతికుమారి, డీజీపీ అంజనీకుమర్ స్వాగతం పలికారు. బేగంపేట నుంచి ఎస్పీజీ దళాల ప్రత్యేక కాన్వాయ్ పర్యవేక్షణలో మోదీ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు.సికింద్రాబాద్ – తిరుపతి మధ్య నడిచే (20701) రైలు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ఉదయం 6గంటలకు బయల్దేరి మధ్యాహ్నం 2.30గంటలకు తిరుపతి చేరుకుంటుంది. ఈ రైలు నల్గొండ, గుంటూరు, ఒంగోలు, నెల్లూరు స్టేషన్లలో ఆగుతుంది. అలాగే, తిరుపతి - సికింద్రాబాద్ (20702) రైలు తిరుపతి రైల్వేస్టేషన్ నుంచి మధ్యాహ్నం 3.15 గంటలకు బయల్దేరి రాత్రి 11.45 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. మంగళవారం మినహా మిగిలిన రోజుల్లో ఈ రైలు సేవలందిస్తుంది.ఈ రైలులో టికెట్ల ధరలను పరిశీలిస్తే..

సికింద్రాబాద్ నుంచి ఒక్కో స్టేషన్‌కు ఛార్జీలు ఇలా..

ఛైర్ కార్ సింద్రాబాద్ నుంచి నల్గొండ - రూ.470 సికింద్రాబాద్ నుంచి గుంటూరు - రూ.865

సికింద్రాబాద్ నుంచి ఒంగోలు - రూ.1075 సికింద్రాబాద్ నుంచి నెల్లూరు - రూ.1270 సికింద్రాబాద్ నుంచి తిరుపతి - రూ.1680

ఎగ్జిక్యూటివ్ ఛైర్ కార్ ఛార్జీలు

సికింద్రాబాద్ నుంచి నల్గొండ - రూ.900

సికింద్రాబాద్ నుంచి గుంటూరు - రూ.1620 సికింద్రాబాద్ నుంచి ఒంగోలు - రూ.2045

సికింద్రాబాద్ నుంచి నెల్లూరు - రూ.2455,

సికింద్రాబాద్ నుంచి తిరుపతి - రూ.3080... ఈ ఛార్జీలకు టికెట్ బుకింగ్ కన్వీనియెన్స్ ఛార్జీలు అదనంగా ఉంటాయి.

## కుటుంబ పాలన నుంచి ప్రజలకు విముక్తి కలిగిస్తాం: ప్రధాని మోదీ



హైదరాబాద్: సికింద్రాబాద్ – తిరుపతి మధ్య వందేభారత్ రైలును అందుబాటులోకి తీసుకురావడం ద్వారా భాగ్యలక్ష్మి నగరాన్ని వేంకటేశ్వరస్వామి నగరంతో కలిపామని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు.సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో సికింద్రాబాద్ – తిరుపతి మధ్య వందేభారత్ రైలును ప్రారంభించిన అనంతరం పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన బహిరంగ సభలో మోదీ ప్రసంగించారు. ప్రియమైన సోదర, సోదరీమణులారా.. అంటూ తెలుగులో ప్రసంగాన్ని మొదలు పెట్టారు."కరోనా, ఉక్రెయిన్ యుద్ధం కారణంగా ప్రపంచం తిరోగమనంలోకి వెళ్లింది. భారత్ మాత్రం ప్రగతి ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది. బడ్జెట్‌లో ఈ ఏడాది మౌలిక వసతుల కల్పన కోసం రూ.10 లక్షల కోట్లు కేటాయించాం. రాష్ట్రంలో రూ.35 వేల కోట్లతో జాతీయ రహదారుల నిర్మాణం చేపట్టాం. జాతీయ రహదారుల విస్తరణకు భారీగా నిధులు కేటాయించాం. రాష్ట్రంలో భారీ టెక్స్‌టైల్ పార్క్ నిర్మించుకున్నాం. టెక్స్‌టైల్ పార్క్‌తో రైతులు, కార్మికులకు ఎంతో ఉపయోగం. తొమ్మిదేళ్లలో భారత్ రూపురేఖలు సమూలంగా మార్చాం. దేశ అభివృద్ధిలో తెలంగాణ భాగమయ్యేలా చేశాం. రూ. 11 వేల కోట్లతో అభివృద్ధి పనులను ప్రారంభించుకున్నాం" అని మోదీ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కలిసి రావడం లేదు"హైదరాబాద్‌లో ఎంఎంటీఎస్ సేవలు విస్తరిస్తున్నాం. ఒక్కరోజే 13 ఎంఎంటీఎస్ రైళ్లను అందుబాటులోకి తీసుకొచ్చాం. సికింద్రాబాద్ - మహబూబ్‌నగర్ రైల్వే డబ్లింగ్ పనులు పూర్తి చేశాం. తెలంగాణలో హైవే నెట్‌వర్క్‌ను వేగంగా అభివృద్ధి చేస్తున్నాం. హైదరాబాద్ - బెంగళూరు అనుసంధానాన్ని మెరుగుపరుస్తున్నాం. తెలంగాణలో జాతీయ రహదారుల విస్తీర్ణాన్ని భారీగా పెంచుతున్నాం. తెలంగాణలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి రాష్ట్ర ప్రభుత్వం కలిసి రావడం లేదు. కేంద్రం ప్రగతి పనులు చేపడుతుంటే రాష్ట్ర ప్రభుత్వం బాధపడుతోంది. తెలంగాణలో 12 లక్షల మందికి ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు ఇచ్చాం. తెలంగాణ అభివృద్ధి కోసం మమ్మల్ని ఆశీర్వదించాలి.కుటుంబ పాలన కారణంగా అవినీతి పెరుగుతోందిరాష్ట్రంలో కుటుంబ పాలన, అవినీతి రాజ్యమేలుతున్నాయి. తండ్రి, కొడుకు, కుమార్తె.. అంతా అధికారంలో ఉంటారు. కుటుంబ పాలన కారణంగా అవినీతి పెరుగుతోంది.కుటుంబ పాలన, అవినీతి వేర్వేరు కాదు. కొంత మంది ప్రగతి నిరోధకులుగా మారారు. ప్రజల సొమ్ము అవినీతిపరులకు చేరకుండా చర్యలు తీసుకుంటున్నాం. నేరుగా రైతులు, విద్యార్థుల ఖాతాల్లో నిధులు జమ చేస్తున్నాం. డిజిటల్ విధానం ద్వారా దళారీ విధానం లేకుండా చేశాం. నిజాయితీతో పనిచేసే వారంటే అవినీతిపరులకు భయం. అభివృద్ధి పనుల్లో కేంద్రంతో రాష్ట్ర ప్రభుత్వం కలిసి రావడం లేదు. దేశాన్ని అవినీతి నుంచి విముక్తి చేయాలా వద్దా? అవినీతిపై పోరాటం చేయాలా? వద్దా? అవినీతిపరుల విషయంలో చట్టం తనపని తాను చేసుకోవాలా? వద్దా?.. కుటుంబ పాలన నుంచి ఈ ప్రజలకు విముక్తి కలిగిస్తాం" అని ప్రధాని మోదీ వెల్లడించారు.

## 8 ఏళ్లలో 23.2 లక్షల కోట్ల 'ముద్ర' రుణాలు: నిర్మలా సీతారామన్

దిల్లీ: చిరు వ్యాపారులు, సూక్ష్మ, చిన్నతరహా సంస్థలకు రుణాలను అందించడమే లక్ష్యంగా కేంద్రం తీసుకొచ్చిన ప్రధాన మంత్రి ముద్ర యోజన పథకం కింద ఇప్పటి వరకు రూ.23.2 లక్షల కోట్ల



రుణాలు బ్యాంకులు మంజూరు చేశాయని కేంద్రం వెల్లడించింది. గడిచిన ఎనిమిదేళ్లలో 40.82 కోట్ల మంది ఈ పథకం కింద లబ్ధి పొందారని పేర్కొంది. కొత్తగా వ్యాపారం చేయాలనుకునే వారికి, వ్యాపార విస్తరణకు ఆర్థిక చేయూతను అందించేందుకు రూ.10 లక్షల వరకు తనఖాలేని రుణాలను అందించేందుకు 2015 ఏప్రిల్ 8న ప్రధాని నరేంద్రమోదీ ఈ పథకాన్ని ప్రారంభించారు. పథకం ప్రారంభించి 8 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడారు. 2023 మార్చి 24నాటికి ఈ పథకం కింద రూ.23.2 లక్షల కోట్ల మొత్తం రుణాలను 40.82 రుణ ఖాతాలకు అందించినట్లు పేర్కొన్నారు.ఈ పథకం కింద లబ్ధి పొందిన వాళ్లలో 68 శాతం మంది మహిళా వ్యాపారులే ఉన్నారని నిర్మలా సీతారామన్ తెలిపారు. మొత్తం రుణాలు పొందిన వారిలో ఎస్సీ/ఎస్టీ, ఓబీసీ కేటగిరీకి చెందిన వారు 51 శాతం మందిని ఉన్నారని పేర్కొన్నారు. భారత్‌లో తయారీకి ఎంఎస్ఎంఈలు ఊతమిస్తున్నాయని, వాటి ఏర్పాటుకు ముద్ర యోజన పథకం ఉపయోగపడుతోందని చెప్పారు. ఈ పథకం వల్ల క్షేత్రస్థాయిలో ఉపాధి అవకాశాలు మెరుగుపడడంతో పాటు దేశ ఆర్థికం వృద్ధి చెందుతోందని చెప్పారు.ఈ పథకంలో మూడు రకాల రుణాలు ఉంటాయి.

## కేవలం ఉద్యోగులకే రూ.70వేల కోట్లు ఖర్చు చేస్తున్నారా: బొప్పరాజు వెంకటేశ్వర్లు

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగులను నిర్లక్ష్యం చేస్తున్నారని.. సమయానికి జీతాలు ఇవ్వలేని దుస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని ఏపీ ఐకాస అమరావతి అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు విమర్శించారు.ఉద్యోగుల మధ్య చిచ్చు పెట్టి ప్రభుత్వం నాలుగు స్తంభాలాట ఆడుతోందని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కేవలం ఉద్యోగులకే రూ.70వేల కోట్లు ఖర్చు చేస్తున్నారా? అని ప్రశ్నించారు. వాలంటీర్లు, సలహాదారుల కోసం రూ. 20 వేల కోట్లను ఖర్చు చేస్తున్న మాటను ఎందుకు చెప్పడం లేదని నిలదీశారు. సర్వీసు రూల్స్ కూడా సరిగా అమలు చేయడం లేదని.. పొరుగు రాష్ట్రాల్లో ఉద్యోగుల పరిస్థితి బాగుందని వ్యాఖ్యానించారు. ఉద్యోగులకు ఒకటో తేదీనే వేతనాలు, పెన్షన్లు, 11వ పీఆర్సీ వేతన స్కేలు అమలు, పీఆర్సీ అరియర్స్, పెండింగ్ డీఏలు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.సమస్యల పరిష్కారానికి ఏపీ జేఏసీ అమరావతి ఉద్యోగ సంఘం రాష్ట్రవ్యాప్తంగా అన్ని కూడళ్లలో మలివిడత పోరాటానికి దిగింది. నల్ల కండువాలు, ప్లకార్డులతో విజయవాడలో ఏపీజేఏసీ అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా బొప్పరాజు మాట్లాడుతూ.. "రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి పేస్కేలు దగ్గర నుంచి డీఏ అరియర్స్, పీఆర్సీ, చివరికి జీతాలు ఇవ్వమంటే అవహేళన చేసే పరిస్థితి వరకు.. అన్ని అంశాలను నాలుగేళ్ల నుంచి రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించట్లేదు. పరిష్కారం సంగతి దేవుడెరుగు కనీసం లెక్కలు చెప్పండయ్యా అంటే.. మేం ఉద్యమం మొదలు పెట్టిన తర్వాత డబ్బులు ఇచ్చామంటున్నారు. ఎంత ఇచ్చారని అడిగితే దానికి సమాధానం చెప్పట్లేదు. అందుకనే ఉద్యమాన్ని మళ్లీ ప్రారంభించాం" అని తెలిపారు.


నిర్లక్ష్యం చేస్తే మూల్యం చెల్లించుకోక తప్పదు..

రాష్ట్ర ప్రభుత్వంతో జరిపిన చర్చల గురించి విలేకరి అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ.. ఉద్యోగులను కించపరిచే విధంగా మంత్రులు తలో మాట మాట్లాడుతున్నారు. ఒకరేమో ఎప్పుడైతే ఏంటి జీతం ఇస్తున్నాం కదా అంటారు. మరొకరేమో రూ.90 వేల కోట్లు మొత్తం ఉద్యోగుల కోసమే ధారపోస్తున్నామంటారు. ఇలా ఏ చర్చల్లోనైనా మేం ఇవ్వాల్సింది ఇస్తాం. చెప్పాల్సింది చెప్పేసి వెళ్లిపోతాం అనే ధోరణితో మాట్లాడుతున్నారు తప్ప సమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదు. ఉద్యోగుల సమస్యల్ని నిర్లక్ష్యం చేస్తే మూల్యం చెల్లించుకోక తప్పదు. మలిదశ ఉద్యమంలో భాగంగా పోస్టర్ల విడుదలతో మొదలై సమీప భవిష్యత్తులో ఉద్యమం తీవ్రరూపం దాల్చుతుంది. ప్రభుత్వ యాప్ వినియోగాన్ని నిలిపి వేస్తూ సెల్ ఫోన్ డౌన్ చేస్తాం" అని బొప్పరాజు తేల్చి చెప్పారు.



## ఎపిలో సంక్షోభంలో వ్యవసాయ రంగం

### పంటల కొనుగోలు..మద్దతు ధరలు లేవు మండిపడ్డ మాజీమంత్రి యనమల



అమరావతి,ఏప్రిల్8:ఏపీలో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో పడిందని టీడీపీ నేత,మాజీ అర్థికమంత్రి యనమల రామకృష్ణుడు ఆందోళన వ్యక్తం చేశారు. మద్దతు ధరలు లేవని, పండించిన పంటలు సరిగా కొనుగోలు చేయడం లేదన్నారు. వ్యవసాయం పట్ల ఇంత నిర్లక్ష్యం ఎప్పుడూ జరగలేదన్నారు. ఏ పంటకు మద్దతుధర లేక క్రాప్ హాలిడే ప్రకటించే పరిస్థితి వచ్చిందని తెలిపారు. 2019-20లో వ్యవసాయ ఉత్పత్తి 175 లక్షల టన్నులు ఉంటే.. ప్రస్తుతం 169 లక్షల టన్నులకు పడిపోయిందని విమర్శించారు. అగ్రికల్చర్ గ్రోత్ 2022-23లో 4.54 శాతానికి పడిపోయిందని తెలిపారు. ఆహార ధాన్యాల దిగుబడులు పెరిగాయంటూ సీఎం జగన్ అసత్యాలు చెబుతున్నారని తప్పుబట్టారు. సాగు విస్తీర్ణం తగ్గితే వృద్ధిరేటు ఎలా పెరిగిందో చెప్పాలని యనమల రామకృష్ణుడు ప్రశ్నించారు. దుక్కి నుంచి దిగుబడి వరకు, విత్తనం నుంచి విక్రయం వరకు, పొలం నుంచి ఫలసాయం వరకు రైతులను చేయి పట్టుకుని నడిపిస్తామన్న జగన్ సర్కార్.. ఈ ఏడాది వ్యవసాయ రంగానికి బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు పెద్దగా పెంచలేదు. సాగు రంగానికి పెద్దగా ఊతం ఇవ్వలేదని వ్యవసాయ రంగ నిపుణులు పెదవి విరుస్తున్నారు. కొత్త పథకాల ఊసే లేని ఈ బడ్జెట్‌లో పాత పథకాలకూ అరకొరగానే నిధులు కేటాయించింది. వ్యవసాయంలో నష్టాలొచ్చి రైతు బలవన్మరణాలకు పాల్పడితే ఇచ్చే ఎక్స్‌గ్రేషియాలో పెంపుదల లేదు. నిధుల కేటాయింపు నామమాత్రంగానే చేసింది. వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఎక్కువ భాగం కేంద్ర ప్రయోజిత పథకాల వాటాతోనే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. నిరుటి దాకా చాలా పథకాలను వినియోగించుకోని జగన్ సర్కార్ ఈ ఏడాది వాటికి రాష్ట్ర వాటా నిధులు కేటాయించింది. వ్యవసాయ, అనుబంధ రంగాలకు 2023-24 బ్జడెట్‌లో రూ.41,436.29కోట్లు ప్రతిపాదించిన ప్రభుత్వం 2022-23 కంటే రూ.1,616.49 కోట్లు తగ్గించింది. వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ కింద 2023-24లో రూ.7,220 కోట్లు ఖర్చు చేయాలని ప్రతిపాదించింది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.4,020కోట్లుగా ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రసంగంలో చెప్పారు. అంటే కేంద్రం వాటా రూ.3,200 కోట్లుగా ఉంది.

## ప్రభుత్వ ఉద్యోగులకు ఒంటిపూట విధులు.. పంజాబ్ కీలక నిర్ణయం



చండీగఢ్: సాధారణంగా వేసవిలో పిల్లలకు ఎండల నుంచి ఉపశమనం కల్పించేందుకు బడులను ఒంటిపూటే నిర్వహిస్తుంటారు. అయితే ప్రభుత్వ ఉద్యోగులకు కూడా ఇలాంటి సదుపాయాన్ని కల్పించింది పంజాబ్ సర్కారు.వచ్చే నెల నుంచి ఒంటిపూట ఆఫీసులను ప్రారంభించనుంది. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి భగవంత్ మాన్ శనివారం ఈ కీలక ప్రకటన చేశారు.పంజాబ్‌లో అన్ని ప్రభుత్వ కార్యాలయాల పనివేళలు ప్రస్తుతం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతున్నాయి. అయితే మే 2వ తేదీ నుంచి ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. జులై 15 వరకు ఈ కొత్త పనివేళలు అమల్లో ఉంటాయని సీఎం భగవంత్ మాన్ ఓ వీడియో సందేశంలో వెల్లడించారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు నిపుణులతో చర్చించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. అంతేగాక, ఆఫీసుల పనివేళలను మార్చడంతో విద్యుత్ లోడ్ కూడా తగ్గుతుందని సీఎం అభిప్రాయపడ్డారు. "మధ్యాహ్నం 1.30 గంటల తర్వాత విద్యుత్‌పై లోడ్ అధికంగా ఉంటుందని విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు. ఇప్పుడు ఆఫీసులను 2 గంటలకు మూసివేయడంతో ఆ లోడ్ 300-350 మెగావాట్లు తగ్గుతుంది. నేను కూడా ఉదయం 7.30 గంటలకే ఆఫీసుకు వస్తాను" అని భగవంత్ మాన్ ఈ సందర్భంగా తెలిపారు.గత కొన్ని రోజులుగా ఎండలు విపరీతంగా మండుతున్నాయి. ఈ ఏడాది వేసవి లో అసాధారణ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని ఇప్పటికే భారత వాతావరణ శాఖ అంచనా వేసింది.

# సంపాదకీయం

ఆదివారం 09-04-2023

## కమలానికి వ్యతిరేకంగా కూటమి

రాహుల్ గాంధీ పార్లమెంటు సభ్యత్వంపై అనర్హత వేటు వేయడం బీజేపీకి శాపంగా మారబోతున్నదా? జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే ఈ అవకాశాన్ని వినియోగించుకుని కాంగ్రెస్ పార్టీ మళ్లీ జాతీయ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించే పరిస్థితి వచ్చేసిందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకూ పాదయాత్ర చేసి తన ఇమేజ్ ని పెంచుకున్న రాహుల్ గాంధీ ఇప్పుడు మరో మెట్టు ఎక్కి జాతీయ స్థాయిలో తనదైన ముద్రను పదిలం చేసుకున్నారు. బీజేపీ పాలనలో ప్రజాస్వామ్యం నిరంతర దాడికి గురవుతోందంటూ కాంగ్రెస్‌తో పాటు 19 విపక్ష పార్టీలు మండిపడ్డాయి. గురువారం బడ్జెట్ సమావేశాలు నిరవధికంగా వాయిదా పడ్డ అనంతరం పార్లమెంటు ప్రాంగణం నుంచి విజయ్ చౌక్ దాకా 'తిరంగా మార్చ్' పేరిట నిరసన ర్యాలీ జరిపాయి. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, బీఆర్ఎస్, డీఎంకే, సమాజ్‌వాదీ, ఆర్జేడీ, ఆప్, ఎన్సీపీ, శివసేన (యూబీటీ), వామపక్షాలు, ఐయూఎంఎల్, ఆరెస్పీ తదితర పార్టీలు ఇందులో పాల్గొన్నాయి. 2019 ఎన్నికలలో అమేధీ నుంచి ఓటమి పాలైన రాహుల్ గాంధీ వాయనాడ్ పార్లమెంటు స్థానం నుంచి గెలుపొందారు. అమేధీని కోల్పోవడంతో కాంగ్రెస్ పార్టీ తీవ్రమైన వత్తిడికి లోనైంది. ఆ నాటి నుంచి కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తెచ్చేందుకు సోనియాగాంధీ తో బాటు రాహుల్ గాంధీ విశేషంగా కృషి చేశారు. అయితే సీనియర్ నాయకుల తిరుగుబాటు, ప్రధాని మోదీ విపరీతమైన ప్రజాకర్షణ ముందు రాహుల్ గాంధీ చేసిన ఏ చర్య కూడా సత్ ఫలితాన్ని ఇవ్వలేదు. కాంగ్రెస్ పార్టీ ఒక అడుగు ముందుకు రెండు అడుగులు వెనక్కి చందంగానే సాగుతున్నది. ఎన్నికల వ్యూహం లేకపోవడం, పార్టీ నాయకులను అదుపు చేసే యంత్రాంగం లేకపోవడం కాంగ్రెస్ పార్టీకి కలిసిరాలేదు. అదే సమయంలో సోనియాగాంధీ అనారోగ్యం పాలుకావడంతో ఆమె, ఆమెతో బాటు రాహుల్ గాంధీ పార్టీని పూర్తిగా వదిలేయాల్సి వచ్చింది. దాంతో నాయకుడు లేని నావలా కాంగ్రెస్ పార్టీ తయారైంది. ఈ దశలో తమ కుటుంబానికి అత్యంత సన్నిహితుడైన అశోక్ గెహ్లాట్ కు పార్టీ అప్పగించాలని సోనియాగాంధీ కుటుంబం నిర్ణయించుకుని ఆ దిశగా ఏర్పాట్లు చేసుకున్నా కూడా అశోక్ గెహ్లాట్ అత్యాశతో కథ అడ్డం తిరిగింది. వృద్ధుడైన మల్లికార్జున ఖర్గేని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడుగా నియమించుకుని కాంగ్రెస్ పార్టీ కాలక్షేపం చేస్తున్నది. లోక్ సభ సార్వత్రిక ఎన్నికలకు సమయం దగ్గరపడుతుండటంతో కాంగ్రెస్ పార్టీకి జవసత్వాలు తీసుకురావాలని సంకల్పించిన రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర ఆరంభించారు. భారత్ జోడో యాత్ర ఆరంభించే నాటికి కనిష్ఠ స్థాయిలో ఉన్న కాంగ్రెస్ పార్టీ యాత్ర ముగిసే నాటికి ప్రజల నుంచి ఆశించిన స్పందన సమకూర్చుకోగలిగింది. అక్కడ నుంచి కాంగ్రెస్ పార్టీ పై చాలా చోట్ల సానుకూల స్పందనలు కూడా మొదలయ్యాయి. పార్టీ పూర్తి స్థాయిలో కోలోకుని, ఎన్నికలను ఎదుర్కొనే స్థితిలోకి ఇంకా రాలేకపోయినా కూడా పార్టీ పరిస్థితి ఆశాజనకంగా మారిందని చెప్పవచ్చు. ఈ స్థితిలో రాహుల్ గాంధీ పై కఠిన చర్యలు తీసుకుని బీజేపీ తప్పటడుగు వేసిందనే అభిప్రాయం వ్యక్తం అవుతున్నది. దేశ వ్యాప్తంగా రాహుల్ గాంధీ పై ఒక్క సారిగా సానుభూతి పెల్లుబుకింది. ఇంత కాలం కాంగ్రెస్ పార్టీని "పెద్దన్న" గా అంగీకరించని చాలా పార్టీలు రాహుల్ గాంధీకి సంఘీభావం ప్రకటించాయి. దేశం మొత్తంలోని ఒకరిద్దరు బిజెపీయేతర ముఖ్యమంత్రులు తప్ప అందరూ రాహుల్ గాంధీపై లోక్ సభ లో తీసుకున్న చర్యను ఖండించారు. అదిలాగే కొనసాగితే దేశం పూర్తిస్థాయి నియంతృత్వంలో మగ్గిపోతుందన్నారు. కొంతకాలంగా కాంగ్రెస్‌తో వేదిక పంచుకోవడానికి ఇష్టపడని తృణమూల్, బీఆర్ఎస్, ఆప్, సమాజ్‌వాదీ పార్టీ కూడా ర్యాలీలోనూ, మీడియా సమావేశంలోనూ కలిసి పాల్గొనడం విశేషం! బడ్జెట్ సమావేశాలు ఆసాంతం ప్రభుత్వంపై విపక్షాలు సమైక్యంగా పోరాడుతున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా మార్చి 13న రెండో విడత సమావేశాలు మొదలైనప్పటి నుంచీ సంయుక్తంగా నిరసనలు, ర్యాలీలతో హోరెత్తిస్తున్నాయి. నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో ప్రతిపక్షాలపై జరుగుతున్న దాడికి ఇది పరాకాష్టగా అభివర్ణించారు. కాంగ్రెస్ పార్టీ మరింత పకడ్బందీగా తన వ్యూహాలను అమలు చేసి అందివచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటే బీజేపీకి కష్టాలు తప్పవు.

# కడపలో పట్టాలెక్కని పరిశ్రమలు

కడప, ఏప్రిల్ 8, రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతి పరుగులు తీస్తుందనే ఆశలు కల్పించింది విశాఖ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్. ఇందులో ఒప్పందాలు కడప జిల్లాకు అనేక పరిశ్రమలను పరుగులు పెట్టించనున్నాయనే భ్రమలు కల్పించాయి. అయితే ఒప్పందాలు జరిగి నెల రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు కడప జిల్లాకు వచ్చే పరిశ్రమలు ఏమిటి? ఏయే రకాల పరిశ్రమలు వస్తున్నాయి. ఏ పరిశ్రమ ఎంత పెట్టుబడితో రానుంది ? వీటికి ఎంత భూమి కావాలి ? ఇలాంటి ఏ సమాచారం ఇప్పటి వరకు జిల్లా కేంద్రానికే అందకపోవడంతో ఈ ఒప్పందాల సంగతేమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మార్చి మూడో తేదీన విశాఖలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో కడప జిల్లా కొప్పర్తిలో ఏర్పాటైన ఎలక్ట్రానిక్ మ్యాను ఫ్యాక్చరింగ్ క్లస్టర్లో 21 పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు రూ.1500 కోట్లతో ఒప్పందాలు కుదుర్చుకున్నట్టు ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్ సీఈవో గౌతమి అప్పట్లో వెల్లడించారు. ఈ పరిశ్రమల ద్వారా 5400 మందికి ఉపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు. దీంతో జిల్లా వాసులు పరిశ్రమలు వెల్లువలా వస్తున్నాయని, యువత ఉపాధికి ఊతం దొరుకుతుందని సంతోషం వ్యక్తం చేశారు. జిల్లాలోని కొప్పర్తి పారిశ్రామిక వాడలో ఇప్పటికే పలు సెల్ కంపెనీలు, ఎలక్ట్రానిక్ పరిశ్రమలు కొన్ని ఏర్పాటవుతున్నాయి. 6700 ఎకరాల్లో ఏర్పాటైన ఈ మెగా ఇండస్ట్రియల్ పార్క్ లో రెండు ఎలక్ట్రానిక్ మ్యాను ఫ్యాక్చరింగ్ క్లస్టర్ ఉన్నాయి. వీటిలో ఏర్పాటు చేసేందుకు విశాఖ సమ్మిట్ లో పారిశ్రామిక వేత్తలు ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఒప్పందం ప్రకారం 21 పరిశ్రమలు ఏర్పాటైతే కొప్పర్తి పారిశ్రామిక వాడకు నిండుదనం రావడంతోపాటు రాష్ట్రంలోనే ఎలక్ట్రానిక్ వెలుగులకు కడప జిల్లా ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంటుందని ఆశించారు. అందునా ఈ సమ్మిట్ కు దేశ, విదేశాలకు చెందిన పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, వివిధ దేశాల రాయబారులు, వారి ప్రతినిధులు హాజరయ్యారు. దీంతో అప్పట్లో ఈ సమ్మిట్ భారీ సక్సెస్ అయిందన్న అభిప్రాయాలు వ్యక్తమవ్వడంతోపాటు ప్రభుత్వం కూడా సంతృప్తిని వ్యక్తం చేసింది. ఇలాంటి వాతావరణంలో కడప జిల్లాకు 21 పరిశ్రమలు వస్తాయని ప్రకటించడం జిల్లా వాసుల్లో ఆనందాన్ని నింపింది. అయితే నెల రోజులు గడిచినా ఇప్పటికీ స్థితి గతులపై స్పష్టత రాలేదు. దీంతో ఈ పరిశ్రమలు ఏర్పాటు నిజమవుతుందా! కలగా మిగులుతుందా? అన్న సందేహాలకు తావునిస్తోందిగత ప్రభుత్వంలో కూడా పరిశ్రమల ఏర్పాటు కోసం అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విశాఖపట్నంలో సమ్మిట్ నిర్వహించారు. ఈ సమ్మిట్ లో కుదుర్చుకున్న ఒప్పందాల ప్రకారం ఆయా పరిశ్రమల జాబితా, వాటికి అవసరమైన స్థలాలు, మౌలిక సదుపాయాలపై జిల్లాల్లోని ఏపీఐఐసీ కార్యాలయాలకు సమాచారం పంపారు. ఇప్పుడు అలాంటి పరిస్థితి కనిపించడం లేదు. పరిశ్రమల స్థాపన ఇప్పటికిప్పుడు చేపట్టలేకపోయినా కనీసం అందుకు సంబంధించిన ప్రాథమిక ప్రక్రియ ప్రారంభం కాకపోవడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

# 2029 సీటు గ్యారంటీ స్కీమ్

విజయవాడ, ఏప్రిల్ 8, 2024 ఎన్నికల్లో టిక్కెట్లు రాకపోయినా 2029 ఎన్నికల్లో మాత్రం టిక్కెట్లు గ్యారంటీ ఇస్తున్నారు ప్రధాన పార్టీ నేతలు. అందుకోసమే అనేక మంది కనిపెట్టుకు కూర్చుని ఉన్నారు. ఒక్కో నియోజకవర్గం నుంచి ఇద్దరు ముగ్గురు నేతలు వైసీపీ, టీడీపీలలో పోటీ పడుతున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలతో విభేదాలున్నా సర్దుకుని కొందరు పోతుండగా, మరికొందరు పక్క చూపులు కూడా చూస్తున్నారు. అయితే ఈ ఎన్నికలకు టిక్కెట్ రాకపోయినా వచ్చే ఎన్నికలకు మాత్రం ఖచ్చితంగా ఇస్తామని పార్టీ అధినేతలు కొందరికి హామీ ఇస్తున్నట్లు సమాచారం. రాజకీయంగా తాము అండగా ఉంటామని కష్టపడుతున్న నేతలకు భరోసా ఇస్తున్నారు. సామాజికంగా కొన్ని సీట్లలో కష్టపడి పనిచేసిన వారికి టిక్కెట్లు ఇవ్వలేకపోతున్నారు. అది రిజర్వ్‌డ్ నియోజకవర్గం కావడం కూడా సీట్లు దక్కని వారు ఎందరో ఉన్నారు. వారికి ఎమ్మెల్సీ పదవి కూడా ఇంత వరకూ చంద్రబాబు ఇవ్వలేకపోయారు. అదే సమయంలో తెలుగుదేశం పార్టీ కూడా పొత్తులతో ముందుకు వెళ్లాలని నిర్ణయించింది. ఇప్పుడు పొత్తుల్లో భాగంగా ఒకవేళ కొందరికి ఇవ్వలేకపోయినా 2029 ఎన్నికల్లో మాత్రం సీట్లు గ్యారంటీ స్కీమ్ చంద్రబాబు ప్రకటించినట్లు తెలిసింది. ఈ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చే విధంగా శ్రమించాలని, వచ్చే ఎన్నికల్లో ఖచ్చితంగా సీటు ఇచ్చి ఎమ్మెల్యేను చేస్తానని మరికొందరికి పార్టీ అధినేత చంద్రబాబు హామీ ఇస్తున్నట్లు తెలిసింది. పొత్తులో భాగంగా టీడీపీ కోల్పోయే సీట్ల విషయంలోనే చంద్రబాబు నేతలకు ఈరకమైన భరోసా ఇస్తున్నట్లు పార్టీ వర్గాలు కూడా ధృవీకరిస్తున్నాయి. ఇక అధికార వైసీపీ కూడా దాదాపు అదే పంథాలో నడుస్తుందని చెప్పాల్సి ఉంటుంది. అయితే వైసీపీ అన్ని స్థానాల్లో ఒంటరిగానే పోటీ చేస్తుంది. అయితే ఈసారి గెలుపు అవసరం కాబట్టి సర్వేను అనుసరించి గెలుపు గుర్రాలకే టిక్కెట్ ఇవ్వాలని నిర్ణయించారు. కొందరు ఎమ్మెల్యేలపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. వై నాట్ 175 అంటూ వైసీపీ అధినేత జగన్ సమావేశాల్లో పదే పదే అంటున్నారు. కానీ ఎమ్మెల్సీలు టిక్కెట్లు రావని భయపడి ఇతర పార్టీల్లోకి వెళ్లే అవకాశముందని గ్రహించిన కొందరు ఎమ్మెల్యేలకు నేరుగా తాను చెప్పకపోయినా సజ్జల వంటి వారిచేత 2029లో గ్యారంటీ సీటు అని చెప్పిస్తున్నారట. ఐదేళ్లు ఆగితే మరోసారి ఎమ్మెల్యే పదవి దక్కుతుందన్న ఆశతోనే ఆగే అవకాశాలున్నాయన్న అంచనాలో ఉన్నారు. ఇంతకీ 2029లో అందరికీ సీట్లు ఎలా ఇస్తారనేగా? అవును అప్పటికి నియోజకవర్గాల పెంపు జరుగుతుంది.

2026 జనాభా లెక్కల ప్రకారం 2029లో సీట్ల సంఖ్య పెంచుతామని ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. తెలంగాణ, ఏపీలో నియోజకవర్గాల పెంపు అంశం విభజన చట్టంలోనూ ఉంది. విభజన చట్టంలోని సెక్షన్ 15కు లోబడి నియోజవర్గాల స్థానాలను పెంచుతామని కేంద్ర ఎప్పుడో స్పష్టం చేసింది. ఈ లెక్క ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతమున్న 175 శాసనసభ నియోజకవర్గాలకు గాను 225 స్థానాలకు పెరుగుతాయి. అంటే యాభై మందికి అదనంగా అవకాశం కల్పించవచ్చు. అప్పుడు అందరికీ సర్దుబాటు చేయవచ్చున్నది రెండు పార్టీల అధినేతల ప్రామిస్. అందుకే ఆగాలని, పార్టీలోనే కొనసాగితే మంచి భవిష్యత్ ఉంటుందని కూడా నమ్మకంగా చెబుతున్నారు. హామీలు ఇస్తున్నారు. మరి ఐదేళ్లు సీటు దక్కని వాళ్లు వెయిట్ చేస్తారా? నేటి పాలిటిక్స్‌లో అది సాధ్యమేనా? అన్న చర్చ కూడా జరుగుతుంది.

# వలసపాకలలో జగనన్న మా భవిష్యత్తు కార్యక్రమం

కాకినాడ మా నమ్మకం నువ్వే జగన్ అనే నినాదం ప్రజల నుంచి వచ్చిందని., జగనన్న వివిధ సభలలో చెప్పినట్లుగా గత 4 ఏళ్ళుగా ప్రభుత్వ పథకాలు ద్వారా ప్రయోజనం పొందితేనే., తమను ఆశ్వీర్వదించమ ని ఇంటింటికి వెళ్ళి కోరుతామని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు తెలిపారు. కాకినాడ రూరల్ మండలం, వలసపాకల గ్రామంలో జగనన్న మా భవిషత్తు కార్యక్రమం ను కాకినాడ జిల్లా వైఎస్ఆర్ సిపి అధ్యక్షులు, కాకినాడ రూరల్ శాసన సభ్యులు కురసాల కన్నబాబు ప్రారంభించారు. కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేసిన కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబుకు కాకినాడ రూరల్ జడ్పిటిసి నురుకుర్తి రామకృష్ణ ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో భాగంగా కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు గృహసారధులతో కలిసి ఇంటింటికి పర్యటించగా ., మహిళలు తిలకం దిద్ది హారతులు పట్టి బ్రహ్మరథం పట్టారు. ఈ కార్యక్రమంలో కురసాల కన్నబాబు., చంద్రబాబు ప్రభుత్వం లో జరిగిన అవకతవకలు, జగనన్న ప్రభుత్వంలో అమలు జరుపుతున్న నవరత్నాల పథకాలను వివరించారు. . గత సర్కారు కు, జగనన్న ప్రభుత్వ పాలనకు తేడాలను తెలియచేసే కరపత్రాలను సచివాలయ కన్వీనర్ల టీం అందచేస్తారని చెప్పారు .గత 46 నెలల్లో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమాభివృద్ధి పథకాలను., ప్రతి ఇంటికి వెళ్ళి గృహ సారధులు వివరిస్తారని అన్నారు. ప్రభుత్వానికి మద్దత్తు తెలిపిన వారి ఇంటికి డోర్ స్టిక్కర్, మొబైలు పోనుకు వారి అనుమతితో సిఎం జగన్ పొటోను అతికిస్తారని, 5 ప్రశ్నలతో ఉన్న ప్రజా మద్దత్తు పుస్తకంలో లబ్దిదారుల అభిప్రాయాలను, గృహ సారధులు నమోదు చేస్తారని కన్నబాబు చెప్పారు. ఈ కార్యక్రమంలో కాకినాడ రూరల్ ఎంపీపీ గోపిశెట్టి పద్మజ బాబ్జి, వైసిపి నాయకుడు గీసాల శ్రీను వైసిపి గ్రామ కమిటీ నాయకులు గుత్తుల కృష్ణంరాజు, రెడ్డి నాయుడు, వైయస్సార్ రాజు , కేతా వెంకటరమణ , నందిపాటి పల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# అక్వా రైతులకోసం పోరాటం

గూడూరు రాష్ట్రంలో ఆక్వా రంగం సంక్షేమంలో ఉందని ఫిషరీస్ అండ్ ఆక్వా బిజెపి సెల్ రాష్ట్ర కన్వీనర్ వేమారెడ్డి సురేందర్ రెడ్డి పేర్కొన్నారు . తిరుపతి జిల్లా గూడూరు పట్టణ పరిధిలోని చెన్నూరు గ్రామంలో ఆయన నివాసంలో మీడియా సమావేశం నిర్వహించారు . చెన్నూరు గ్రామంలోని ఫిషరీస్ అండ్ ఆక్వా బిజెపి సెల్ రాష్ట్ర కన్వీనర్ సురేందర్ రెడ్డి నివాసంలో స్థానిక బిజెపి నాయకులు శుక్రవారం ఆయనను కలిసి పూలమాలలు వేసి శాలవాలు కప్పి అభినందనలు తెలిపారు . ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సురేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని తీర ప్రాంతంలో వేలాది మంది కుటుంబాలు చేపలు మరియు రొయ్యల పెంపకం పై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నారు వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆయన పాదయాత్రలో ఆక్వా రైతులకు ఎన్నో వరాలు హామీలుగా ఇచ్చారని ఆయన అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక హామీ కూడా నెరవేర్చలేదని విమర్శించారు బిజెపి ఆక్వా రైతుల పక్షాన నిలబడి పోరాటాలు చేస్తామని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి ప్రకాష్ నాయుడు , బిజెపి నాయకులు బైరప్ప కిరణ్ రెడ్డి తేజ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# జగన్ కు అనుభవం లేకపోవడం వల్ల సమస్యలు

కర్నూలు, ఏప్రిల్ 8 (న్యూస్ పల్స్) ఉమ్మడి కర్నూలు జిల్లా ఆదోని ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి సీఎం జగన్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. వైసీపీ ఎమ్మెల్యేలు అసంతృప్తితో వున్న మాట వాస్తవమేనని దీనికి కారణం జగన్‌కు అనుభవం లేకపోవడమేనన్నారు. ఎమ్మెల్యేలతో ఎలా వుండాలన్న దానిపై జగన్ అనుభవం లేదంటున్నారు. అయితే రెండోసారి సీఎంగా అవకాశమిస్తే జగన్‌కు పూర్తి అవగాహన వస్తుందని సాయిప్రసాద్ రెడ్డి చెప్పుకొచ్చారు. కర్నూలు జిల్లా ఆదోని మండలం అరేకల్లులో ఇంటింటికి తిరుగుతూ ఈ వ్యాఖ్యలు చేశారు వైసీపీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి. దీంతో ఆయన పక్కనే ఉన్న సొంతపార్టీ నేతలు అవాక్కయ్యారు. సాయిప్రసాద్ రెడ్డి కామెంట్లపై వైఎస్ఆర్‌సీపీలో అంతర్గతంగా చర్చ జరుగుతోంది. ఉద్దేశపూర్వకంగా అన్నారా లేకపోతే తన అభిప్రాయాన్ని అలా చెప్పారా అన్న దానిపై హైకమాండ్ సన్నిహితులు ఆరా తీస్తున్నారు. ఇటీవల వైఎస్ఆర్‌సీపీలో ఎమ్మెల్యేల అసంతృప్తి అంశంపై విస్తృతంగా చర్చ జరుగుతోంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో నలుగురు ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగ్ చేశారు. ఆ సమయంలోనే ఇరవై మందికిపైగా ఎమ్మెల్యేలు అసంతృప్తితో ఉన్నారని గుర్తించి వారితో సీఎం జగన్ ప్రత్యేకంగా మాట్లాడినట్లుగా తెలుస్తోంది. కానీ వారిలో అసంతృప్తి తగ్గలేదని చెబుతున్నారు. మరో వైపు తెలుగుదేశం పార్టీ వైఎస్ఆర్‌సీపీతో మైండ్ గేమ్ ఆడుతోంది. తమతో నలభై మంది ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారని చెబుతున్నారు. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే వాటిని కొట్టి పారేయలేమన్న వాతావరణం ఉండటంతో సాయి ప్రసాద్ రెడ్డి లాంటి ఎమ్మెల్యేలు అన్యాపదేశంగా చేసిన వ్యాఖ్యలు కూడా వైరల్ అవుతున్నాయి. సీఎం జగన్ వచ్చే ఎన్నికల్లో ప్రజా వ్యతిరేకత ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేల విషయంలో కఠినంగా ఉండాలని అనుకుంటున్నారు. గతంలో ఇదే విషయాన్ని నేరుగా చెప్పి తనకు ఎంత సన్నిహితులైనా సర్వేల్లో బాగా లేకపోతే టిక్కెట్లు ఇచ్చేది లేదని ప్రకటించేవారు. అయితే ఇటీవల జరిగిన ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల తర్వాత సీఎం జగన్ స్వరంలో మార్పు వచ్చింది. ఎవర్నీ వదులుకోనని అందర్నీ గెలిపించుకుంటానని ప్రకటించారు. ఎమ్మెల్యే టిక్కెట్లుఇవ్వలేకపోతే మరో విధంగా న్యాయం చేస్తానన్నారు. అయితే రాజకీయ నాయకులు తమ ఎమ్మెల్యే టిక్కెట్లకు ఎసరు పెడితే వేరే పార్టీలో చూసుకుంటారు. వైసీపీ ఎమ్మెల్యేలు కూడా ఎక్కువ మందిఅదే పని చేస్తున్నారు. ఈ క్రమంలో సీఎం జగన్ పాలన సరిగ్గా చేయలేకపోయారని.. దానికి అనుభవం లేకపోవడమే కారణమని చెబుతూండటం ఆసక్తి రేపుతోంది.

# నిర్భాగ్య పిల్లల పాలిట వరం మిషన్ వాత్సల్య పథకం

**సీఆర్పీఎఫ్ జిల్లా కన్వీనర్ డా.బాక లవకుశ**

అరకులోయ దేశంలో నిస్సయ స్థితిలో ఉన్న పిల్లల పాలిట వరం వంటిది మిషన్ వాత్సల్య పథకమని అల్లూరి సీతారామ రాజు జిల్లా చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం (సీఆర్పీఎఫ్) కన్వీనర్ డాక్టర్ బాకా లవకుశ అన్నారు,మండలంలోని లోతేరు పంచాయితీ శనివారం సంతలో బాలల హక్కుల పరిరక్షణ వేదిక(సిఆర్పీఎఫ్) ఆధ్వర్యాన ఇటీవల ప్రవేశ పెట్టిన మిషన్ వాత్సల్య పథకంపై ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లి కాని, తండ్రి కాని లేని,లేదా విడాకులు తీసుకున్న 18 సంవత్సర లోపు ఉన్న అనాద, నిర్భాగ్య పిల్లలను ఆదుకోవడానికి,వారి భవిష్యత్‌కు ఈ పథకం ద్వారా ఆర్థిక మేలు ఎంతో మేలు జరగనుందని అన్నారు,అనాథలు,నిస్సహాయ స్థితిలో ఉన్న బాలబాలికలకు ఆరోగ్యంతో పాటు ఆర్థికభరోసా కల్పించేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సంయక్తంగా మిషన్ వాత్సల్య పథకాన్ని నూతనంగా ప్రవేశపెట్టిందన్నారు. ఈ పథకం కింద అర్హులైన వారికి ప్రతినెలా రూ.4 వేలు అందజేయనున్నారు. ఈ పథకంలో చేరాలనుకొనేవారు గ్రామీణ ప్రాంత వాసులకు వార్షికాదాయం 72 వేలు పట్టణ ప్రాంతల వాసులకు 96 వేలు మించరాదన్నారు. అర్హులైన బాలబాలికలు ఈ పథకానికి వినియోగించుకోవాలని కోరారు. జిల్లాలోని గ్రామ స్థాయి నుంచి మండల స్థాయివరకు ఈ పథకం వల్ల బాలలకు ఉపయుక్తతపై సిఆర్పిఎఫ్ విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యాతిదిగా హజరైన లోతేరు పంచాయితీ సర్పంచి గుబ్బాయి కళావతి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఈ పథకం నిర్భాగ్యులైన ప్రతి బాలబాలకు వర్తించే వాలంటీర్లు పనిచేయలన్నారు. ప్రతి ఇంటింటికి ఈ సమాచారం చేరేలాగ వాలంటీర్లు, అంగన్వాడీ టీచర్ , ఆయాలు మరియు ఆశ వర్కర్లు కూడ మన వంతు బాధ్యతగా మన పంచాయితీ వాసులకొరకు పనిచేయలన్నారు. అందరు సామాజిక స్పృహతో పౌరులంతా అభాగ్యులైన పిల్లలకు చేదోడు వాదోడుగా సమాచారం అందించాలన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేది ఏప్రిల్ 15లోగా సంబందిత కార్యలయలో సమర్పించలన్నారు. దగ్గరరలో ఉన్న అంగన్వాడీ కేంద్రాలతో పాటు ఐ సిడిఎస్ సిడిపిఒ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్ సర్పంచి గుబ్బాయి శ్రీరామ్ , వైస్ సర్పంచి, ఆశ వర్కర్లు అంగన్వాడి ఆయలు గ్రామ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీ కోదండరాముడి చక్రస్నానం

బద్వేలు ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో చివరిరోజైన శనివారం ఆలయ సమీపంలోని పుష్కరిణిలో చక్రస్నానం నేత్రపర్వంగా జరిగింది. విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని పుణ్యస్నానాలు ఆచరించారు. ఆలయంలో ఉదయం 4 గంటలకు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి ఆలయ శుద్ధి, ఆరాధన నిర్వహించారు. ఉదయం 9.30 గంటలకు శ్రీ లక్ష్మణ సమేత సీతారాములవారు తిరుచ్చిలో, సుదర్శన చక్రత్తాళ్వార్ పల్లకిలో ఊరేగింపుగా పుష్కరిణి వద్దకు వేంచేశారు. ఉదయం 10.30 నుండి 11 గంటల వరకు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు వేడుకగా స్నపనతిరుమంజనం నిర్వహించారు. ఇందులో సీతారామ లక్ష్మణ సరసన చక్రత్తాళ్వార్లు పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనంతో అభిషేకాలు అందుకున్నారు. అనంతరం అర్చకులు వేదమంత్రోచ్ఛారణ నడుమ శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహించారు. రాత్రి 7 గంటలకు ధ్వజావరోహణంతో శ్రీకోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాలు ముగిసాయి. ఈ కార్యక్రమంలో డెప్యూటీ ఈవో నటేష్ బాబు, సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం, టెంపుల్ ఇన్స్పెక్టర్ ధనుంజయ, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

# అల్లు అర్జున్ జన్మదిన సంబరాలు

**జన్మదిన సందర్భంగా సేవ కార్యక్రమాలు**

కౌతాళం మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో మెగాస్టార్ చిరంజీవి ఫ్యాన్స్ అధ్యక్షుడు మంగలి ఉరుకుంద మరియు ఐకాన్ స్టార్ సేవాసమితి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ జన్మదిన సందర్భంగా పెద్ద ఎత్తున డ్రమ్స్ తో ర్యాలీ చేస్తూ బానసంచాలు పేలిస్తూ అల్లు అర్జున్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి కేక్ కట్ చేసి అనాధలకు పేద ప్రజలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా డాక్టర్ డానియల్ సైకిల్ షాప్ డేనియల్ చిన్నబాబు పాల్గొన్నారు. తదనంతరం అల్లు అర్జున్ సేవా సమితి సభ్యులు మాట్లాడుతూ అల్లు అర్జున్ జన్మదిన అంటే మాకు పండుగ లాంటిదని తెలిపారు ఈ కార్యక్రమంలో చిరంజీవి ఫ్యాన్స్ అధ్యక్షుడు మంగలి ఉరుకుంద ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ సేవాసమితి సభ్యులు ఉదయ్ కుమార్ గోవిందు గణేష్ రామ్ చరణ్ తేజ్ సంతోష్ రఘు వసంత నరేంద్ర పాల్గొన్నారు.

# అత్యాచారం కేసు నిందితులు..విడుదల

ఏలూరు, ఏప్రిల్ 8, (న్యూస్ పల్స్)అత్యాచారం కేసులో ఏపీకి చెందిన కొందరు పోలీసులకు భారీ ఊరట లభించింది. వారిని నిర్దోషులుగా కోర్టు విడుదల చేసింది. రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఒక గ్రామంలో 16 ఏళ్ల క్రితం 11 మంది గిరిజన మహిళలపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన 21 మంది పోలీసులను ప్రత్యేక కోర్టు నిర్దోషులుగా ప్రకటించింది. నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయడంలో ఇద్దరు దర్యాప్తు అధికారులు విఫలమైనందున నిందితులను ప్రాథమికంగా నిర్దోషులుగా విడుదల చేసినట్లు కోర్టు పేర్కొంది. ఆగస్టు 2007లో గ్రేహౌండ్స్, ప్రత్యేక బృందానికి చెందిన పోలీసు సిబ్బంది మహిళలపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. 2018లో విశాఖపట్నంలో విచారణ ప్రారంభమైంది. ఎస్సీ,ఎస్టీ (అట్రాసిటీల నిరోధక) చట్టం కింద కేసు నమోదు కాగా.. పోలీసులను నిర్దోషులుగా ప్రకటించింది. ఇదిలా ఉండగా, అత్యాచార ఘటనలో ప్రాణాలతో బయటపడిన వారికి డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (డీఎల్ఎస్ఏ) ద్వారా పరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశించింది. హ్యూమన్ రైట్స్ ఫోరమ్ (ఊఖీఈ) సభ్యుడు తెలిపిన ప్రకారం, నిందితులు ఎవరూ అరెస్టు చేయబడలేదు. వారిలో కొందరు విజయవంతంగా పదవీ విరమణ చేయగా.. కొందరు మరణించారు. ఆగస్టు 2007లో గ్రేహౌండ్స్ బలగాలు 11 మంది గిరిజన మహిళలపై అత్యాచారం చేశాయని ఊఖీఈ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షుడు ఓ శరత్ అన్నారు. వారిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు కానీ ఒక్క నిందితుడిని కూడా అరెస్టు చేయలేదు అని ఆరోపించారు. 2007 ఆగస్టు 20న 21 మంది సభ్యులతో కూడిన ప్రత్యేక పోలీసు బృందం వాకపల్లి గ్రామానికి కూంబింగ్ ఆపరేషన్ల కోసం వెళ్లిందని, ముఖ్యంగా బలహీన గిరిజన వర్గానికి (ఖఏఉ) చెందిన 11 మంది గిరిజన మహిళలపై లైంగిక దాడికి పాల్పడ్డారని ఫోరం ఆరోపించింది. వాకపల్లి అత్యాచార బాధితురాలికి నష్టపరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశించిందంటే, వారి నివేదనలపై కోర్టు విశ్వాసం ఉంచిందని హెచ్ఆర్ఎఫ్ పేర్కొంది. పోలీసులపై విచారణ ప్రారంభంలోనే రాజీ పడింది

# ఏపీలో పొలిటికల్ వారసులు

## ఖర్చీఫ్ వేస్తున్న నేతాశ్రీలు

విజయవాడ, ఏప్రిల్ 8, ఏపీ పాలిటిక్స్‌లో ఇప్పుడు వారసుల సీజన్ నడుస్తోంది. ఎక్కడికక్కడ పార్టీ సీనియర్ లీడర్స్ తమ కొడుకులు, కూతుళ్ళని వచ్చే ఎన్నికల కోసం సిద్ధం చేస్తున్నారు. ఈసారి టిక్కెట్ మాకు ఇవ్వకున్నా ఫర్లేదు? మా వాళ్ళకు ఇవ్వండంటూ పార్టీ నాయకత్వాలకు సంకేతాలు పంపుతున్నారు. మరికొందరైతే ఏకంగా అధిష్ఠానం పెద్దల దగ్గరే తమ మనసులోని మాటను చెప్పేస్తున్నారు. అట్నుంచి ఎలాంటి క్లారిటీ రాకున్నా?. ఎవరి ప్రయత్నాలు వారు మాత్రం చేస్తున్నారు. గతంలో ఇంటింటికీ మన ప్రభుత్వం కార్యక్రమంలోనే తమ వారసుల్ని దింపాలని కొందరు నాయకులు ప్రయత్నించినా? జగన్ వారించి? వారినే తిరగమనడంతో అప్పటికి తగ్గారు. తిరిగి ఇప్పుడు ప్రయత్నాలు మొదలుపెట్టారు.చిత్తూరు జిల్లాలో వారసుల హంగామా హాట్ టాపిక్ అయింది. తిరుపతి నుంచి కుప్పం దాకా కుదిరిన చోటల్లా? ముఖ్య నాయకుల కొడుకులు, కూతుళ్ళు క్రియాశీలకంగా మారుతున్నారు. అందులో అగ్ర భాగాన ఉన్నారు తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి. ఆయన కుమారుడు అభినయ్ రెడ్డికి మొదట్నుంచి రాజకీయాల మీద ఆసక్తి ఎక్కువ. నియోజకవర్గానికి ఎమ్మెల్యే కరుణాకర్‌రెడ్డే అయినా? అనధికారికంగా అంతా అభినయే నడుపుతున్నారట. పార్టీ నాయకులతోనే కాకుండా అధికారులతో కూడా నేరుగా మాట్లాడే వాడట. చివరికి తిరుపతి కార్పొరేషన్ ఎన్నికల్లో అభినయ్ రెడ్డి కార్పొరేటర్‌గా ఏకగ్రీవమయ్యాయి. తర్వాత డిప్యూటీ మేయర్ పదవి వచ్చింది. ఇప్పుడు అధికారిక హోదాలోనే సిటీ అంతా తిరుగుతున్న డిప్యూటీ మేయర్? ఈసారి ఎన్నికల్లో తిరుపతి బరిలో తానే దిగేందుకు సిద్ధమవుతున్నారట. కరుణాకర్‌రెడ్డి కూడా కొడుకుని ఎమ్మెల్యేగా చూడాలని తహతహలాడుతున్నారట. అందుకుతగ్గట్టే ఈసారి ఎన్నికలకు దూరంగా ఉంటానని గతంలోనే ఆయన ప్రకటించారు కూడా.ఇక చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కూడా ఇదే రూట్లో ఆలోచిస్తున్నారట. ఆయన పెద్ద కుమారుడు మోహిత్ రెడ్డిని రాజకీయ నాయకుడిగా నిలబెట్టాలని చాలా కాలంగా ప్రయత్నిస్తున్నారు. వైసీపీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న మోహిత్ రెడ్డి తిరుపతి రూరల్ నుంచి ఎంపీటీసీగా ఎన్నికై ఎంపీపీ పదవి చేపట్టారు. అదే హోదాలో చంద్రగిరి నియోజకవర్గం మొత్తం పాదయాత్ర చేయడం హాట్ టాపిక్ అయింది. అంటే? నెక్స్ట్ నేను రెడీగా ఉన్నానన్న సంకేతాలు పంపారన్నది లోకల్ టాక్. నియోజకవర్గంలోని అభివృద్ధి పనుల్లో సైతం నేరుగానే జోక్యం చేసుకుంటున్నారు మోహిత్.మోహిత్ రెడ్డి పోటీకి జగన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని స్వయంగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డే ప్రకటించారు. పార్టీ పరంగా 23 అనుబంధ సంఘాల బాధ్యతలను చెవిరెడ్డికి అప్పగించడంతో? ఆయన ఆ పెద్దరికపు బాధ్యతల్లో ఉండి కొడుకుని ఎమ్మెల్యేగా గెలిపించి వెనకుండి నడిపించాలనుకుంటున్నారట. ఎన్నికల తర్వాత చెవిరెడ్డికి టీటీడీ ఛైర్మన్‌గానీ? రాజ్యసభ సీటు గానీ ఇస్తానని చెప్పారట జగన్. అందుకే ఇక వారసుడి భవిష్యత్‌పై ఫుల్ ఫోకస్ పెట్టారట భాస్కర్‌రెడ్డి.వీరితో పాటు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్న కుమారుడు సుధీర్ రెడ్డి సైతం పీలేరు, మదనపల్లె, పలమనేరులో ఏదో ఒక చోట నుంచి పోటీ చేస్తారన్న ప్రచారం జరుగుతోంది.సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కుమారుడు సుమన్ పరిస్థితి కూడా ఇంతే. ఆదిమూలం ఎమ్మెల్యే అయ్యాక సుమన్ నియోజకవర్గంలో చెలరేగిపోయారు. స్థానిక ఎన్నికల్లోనారాయణ వనం జడ్పీటీసీగా ఏకగ్రీవం అయ్యారు. తర్వాత అదే హోదాలో అధికారిక కార్యక్రమాలన్నిటికీ హాజరవుతున్నారు. జీడీ నెల్లూరులో డిప్యూటీ సిఎం నారాయణ స్వామి కూడా తన కుమార్తెకు పోటీ చేసే అవకాశం ఇవ్వాలని అధినాయకత్వాన్ని అడిగినట్టు తెలిసింది. అయితే? ఇప్పటివరకు భూమన, చెవిరెడ్డి వారసులకు మాత్రమే గ్రీన్ సిగ్నల్ వచ్చినట్టు తెలిసింది.ఉమ్మడి గుంటూరు జిల్లా విషయానికి వస్తే? గుంటూరు తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఉన్న ముస్తఫా, తన కుమార్తెను రాజకీయ వారసురాలిగా ప్రకటించారు. అధిష్టానం ఆశీస్సులు ఉన్నాయని, 2024 ఎన్నికల్లో ఫాతిమాకు సీటు వస్తుందని ఇప్పట్నుంచే ప్రచారం చేసుకుంటున్నారు. అందుకు తగ్గట్టే ఫాతిమా కూడా గడప గడపకు కార్యక్రమంలో తిరుగుతూ? ప్రజలు, అధికారులకు పరిచయం అవుతున్నారు.రాజ్యసభ ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు రేపల్లె నియోజకవర్గం ఇన్‌ఛార్జ్‌గా ఉన్నారు. తాను ఎంపీగా ఉండగానే? కుమారుడికి పొలిటికల్ రూట్ క్లియర్ చేసే పనిలో ఉన్నారాయన. ఈసారి ఎన్నికల్లో మోపిదేవి రాజీవ్‌ను రంగంలోకి దింపే ప్రయత్నాల్లో ఉన్నారు వెంకటరమణ. ఇక మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి కుమారుడు పోటీ చేయబోతున్నారన్న ప్రచారం ఉంది. ఇటీవల కాలంలో అయోధ్య రామిరెడ్డి మంగళగిరి నియోజకవర్గాన్ని వదిలిపెట్టకుండా తిరుగుతున్నారు . ఇక్కడ ఇప్పటికే అయోధ్యరామిరెడ్డి సోదరుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నారు. ఈసారి పోటీకి ఆర్కే పోటీ చేయడానికి విముఖత చూపిస్తే, తన కుమారుడిని రంగంలోకి దింపాలన్న ఆలోచనలో ఉన్నారట అయోధ్య రామిరెడ్డి. తెనాలి నియోజకవర్గంలో మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి కుమారుడు పోటీ చేయబోతున్నారన్న ప్రచారం జరుగుతోంది. కమ్మ సామాజిక వర్గానికి మిగిలిన పార్టీలు టిక్కెట్ ఇస్తే వైసిపి నుంచి కాపు సామాజిక వర్గ నేతగా ముద్రపడ్డ బాలశౌరి కుమారుడితో పోటీ చేయించాలన్న యోచనలో నాయకులు ఉన్నట్లు తెలుస్తోంది .ఇక కృష్ణా జిల్లాలో తండ్రి వారసత్వంతో రాజకీయాల్లోకి వచ్చిన పేర్ని నాని తాను లైమ్‌లైట్‌లో ఉండగానే కుమారుడిని సెటిల్ చేయాలన్న ఆలోచనలో ఉన్నారట. మూడు సార్లు మచిలీపట్నం నుంచి ఎమ్మెల్యేగా గెలవడంతో పాటు మంత్రిగా పనిచేసిన పేర్ని నాని ఇక రాజకీయాలకు గుడ్ బై చెప్పాలని అనుకుంటున్నారట. తన తండ్రి ఏ విధంగా రిటైర్డ్ మెంట్ తీసుకున్నారో.. అలాగే ఎమ్మెల్యే, మంత్రిగా పనిచేసిన తాను కూడా రిటైర్మెంట్ తీసుకోవాలని భావిస్తున్నారట. అందుకే ఇప్పుడు తన కుమారుడు కిట్టును వచ్చే ఎన్నికల్లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి తీసుకువచ్చి మచిలీపట్నం బరిలో దింపే ప్రయత్నాల్లో ఉన్నారట. కిట్టు అరంగేట్రానికి గడప గడపకు కార్యక్రమాన్నే వేదికగా మలుచుకుంటున్నారట పేర్ని. పార్టీ కార్యక్రమాల్లో తండ్రికంటే ఎక్కువగా కుమారుడు పాల్గొనడం ఇప్పుడు బందర్‌లో హాట్ టాపిక్ అయింది.తన మనసులోని మాటను పార్టీ అధిష్టానం దగ్గర చెప్పారట పేర్ని. కానీ? అట్నుంచి ఇంకా క్లారిటీ రాలేదట.రాజకీయ వారసులకు మంచి టేకాఫ్ ఇవ్వాలనే ఆలోచన ఉమ్మడి విశాఖ జిల్లా సీనియర్స్‌లో కూడా కనిపి స్తోంది. ఈ జాబితాలో టీడీపీ నుంచి మాజీ మంత్రులు గంటా శ్రీనివాసరావు, అయ్యన్న పాత్రుడు ఉన్నారు. ప్రస్తుతం విశాఖ నార్త్ ఎమ్మెల్యేగా ఉన్న గంటా శ్రీనివాసరావు వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గం మారాలని చూస్తున్నారు. అది కూడా సెమీ అర్బన్ లుక్ ఉన్న భీమిలి, పెందుర్తి, యలమంచిలిలో ఏదో ఒకటి ఐతే.. విజయం తేలిక అవుతుందని లెక్కలేసుకుంటున్నారు. అదే సమయంలో గంటా కుమారుడు రవితేజ రాజకీయ అరంగేట్రం కోసం కసరత్తు జరుగుతోందట. కాపు సామాజిక వర్గం ఎక్కువగా వున్న చోడవరం స్థానం నుంచి పోటీ పెడితే ఎలా ఉంటుందనే చర్చ జరుగుతోందట. కానీ.. టీడీపీలో తండ్రీ, కొడుకులకు టిక్కెట్లు దక్కే అవకాశాలపై చర్చ జరుగుతోందట. ఇక్కడే కొత్త లెక్కలు తీస్తోంది గంటా వర్గం. పార్టీలో కీలకంగా ఉన్న మాజీమంత్రి నారాయణకు అల్లుడు రవితేజ. ఈ కోటా వర్కవుట్ అయితే అవకాశాలు మెరుగుపడ తాయనే అభిప్రాయం ఉంది.ఇక, మరో మాజీమంత్రి., పొలిట్ బ్యూరో సభ్యుడు అయ్యన్న కూడా ఈసారి రాజకీయ వారసుడి కోసం గట్టిగా పట్టుబట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# మొన్న లోకేష్.. నేడు చంద్రబాబు..

## అభివృద్ధిపై సీఎం జగన్‌కు సెల్ఫీ ఛాలెంజ్‌లు

అనంతపురం, ఏప్రిల్ 8, ఆంధ్రప్రదేశ్ లో ఎప్పుడో ఎన్నికల వేడి మొదలైంది. అధికార పార్టీ వైసీపీ పార్టీ నేతల మధ్య ప్రతి పక్ష నేతల మధ్య మాటల యుద్ధం ఓ రేంజ్ లో సాగుతుంది. సీఎం జగన్ సహా మంత్రులు, ఎమ్మెల్యేలు అందరూ గత ప్రభుత్వం పనితీరు అంటూ టీడీపీ నేతలపై మాటల తూటాలు విడుస్తున్నారు. ప్రభుత్వ పని తీరు ఇది అంటూ పాదయాత్ర చేస్తోన్న టీడీపీ నేత నారా లోకేష్ తో పాటు పలువురు నేతలు సవాల్ విసురుతున్నారు. ఇప్పటికే లోకేష్ అనంతపురం జిలాల్లో ఉన్న కియా సంస్థ ముందు సెల్ఫి దిగి ఛాలెంజ్ విసరగా.. తాజాగా టీడీపీ అధ్యక్షులు ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు వంతు వచ్చింది. సీఎం సీఎం జగన్‌కు చంద్రబాబు సెల్ఫీ చాలెంజ్ విసిరారు. ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డికి సెల్ఫీ సవాల్ విసిరారు మాజీ సీఎం చంద్రబాబునాయుడు. నెల్లూరులో టిడ్కో కాలనీ ముందు ఫోటోలు దిగిన చంద్రబాబు సోషల్ మీడియాలో పోస్ట్ చేసి? సీఎం జగన్‌కు సవాల్ విసిరారు. గత ప్రభుత్వంలో పేదల కోసం కట్టిన వేలాది ఇళ్లు ఇవి?రాష్ట్రంలో నాడు నిర్మించిన లక్షల టిడ్కో ఇళ్లకు సజీవ సాక్ష్యాలని చెప్పారు. మరి నాలుగేళ్లలో మీరు నిర్మించిన పేదల ఇళ్లు ఎన్నో లెక్క చెప్పగలరా.. అసలు మీరు కట్టిన ఇళ్లెన్నో చూపించగలరా జగన్ అంటూ చంద్రబాబు ట్యాగ్ చేశారు.నెల్లూరులో ఏర్పాటు చేసిన టీడీపీ ప్రాంతీయ సదస్సులో టీడీపీ అధినేత చంద్రబాబు మాట్లాడుతూ.. అంతేకాదు వై నాట్ కుప్పం అని వైసీపీ నేతలు హేళన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తారు. మూడు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల తర్వాత ఏపీలో పొలిటికల్ మూడ్ మారిపోయిందన్నారు. ఇకపై టీడీపీ గురి వై నాట్ పులివెందులేనని చెప్పారు చంద్రబాబు.

# గంజాయి వద్దు బ్రో...టీడీపీ ప్రచారం

అనంతపురం, ఏప్రిల్ 8,తెలుగుదేశం పార్టీ కొత్త ప్రచార కార్యక్రమం చేపట్టింది. గంజా వద్దు బ్రో అంటూ క్యాంపెయిన్ ప్రారంభించింది. లోకేష్ పాదయాత్రలో ఈమేరకు యువత నినాదాలతో కూడిన టీ షర్టులను వాలంటీర్లు దరించారు. గంజాయి వద్దు బ్రో అంటూ రాసి ఉన్న క్యాప్, టీ షర్టులను యువత డ్రగ్స్?కి దూరంగా ఉండాలి అంటూ మెసేజ్ ఇస్తున్నారు. ఈ గంజాయి ఏపీకి కేర్ ఆఫ్ అడ్రస్?గా మారిందని లోకేష్ మండిపడ్డారు. గత 63 రోజులుగా డ్రగ్స్ సంస్కృతికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నామని సీఎం జగన్ పాలనలో ఏపీ గంజాయి క్యాపిటల్ ఆఫ్ ఇండియాగా మారింది. ఆఖరికి తిరుమలని కూడా వైసీపీ గంజాయి మాఫియా వదలడం లేదు. చివరకు తిరుమలలో కూడా గంజాయి అమ్ముతున్నారు అంటే ఎంత దారుణమైన పరిస్థితి ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. గంజాయి వలన యువత భవిష్యత్తు నాశనం అవుతుంది. తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురి అవుతున్నారు. టీడీపీ హయాంలో రూ. 40వేల కోట్లు విలువ చేసే గంజాయిని తగలబెడితే ఇప్పుడు ఏకంగా వైసీపీ నాయకులు గంజాయి పంట వేస్తున్నారు. పాదయాత్రలో ఉండగా చంద్రగిరిలో ఒక తల్లి వచ్చి తన కుమార్తె గంజాయికి బానిస అయ్యిందని ఆవేదన వ్యక్తం చేసింది. ఆ తల్లి చెప్పిన మాటలు నన్ను కలచివేశాయి. అందుకే గంజాయికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటం చెయ్యాలని నిర్ణయం తీసుకున్నాం. టీడీపీ హయాంలో పెట్టిన డీఎడిక్షన్ సెంటర్లు కూడా వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేశారు. యువత అంతా డ్రగ్స్, గంజాయికి దూరంగా ఉండాలి అని పిలుపు ఇస్తున్నా.. టీడీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే వైసీపీ గంజాయి మాఫియాపై చర్యలు తీసుకుంటాం. గంజాయి వద్దు బ్రో..యువత గంజాయికి దూరంగా ఉండాలి అంటూ" లోకేష్ పిలుపునిచ్చారు.టీడీపీ హయాంలో 40వేల కోట్ల రూపాయిలు విలువ చేసే గంజాయిని తగలబెడితే... ఇప్పుడు ఏకంగా వైసిపి నాయకులు దాని పంట వేస్తున్నారని లోకేష్ ఎద్దేవా చేశారు. పాదయాత్రలో ఉండగా చంద్రగిరిలో ఒక తల్లి వచ్చి.. తన కుమార్తె మాదక ద్రవ్యాలకు బానిస అయ్యింది అని చెప్పిందని.. ఆ సంఘటన తనను కలచివేసిందన్నారు లోకేష్. అందుకే గంజాయికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటం చెయ్యాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. టిడిపి హయాంలో పెట్టిన డి ఎడిక్షన్ సెంటర్లను కూడా వైసిపి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. యువత అంతా డ్రగ్స్ కు దూరంగా ఉండాలి అని పిలుపునిచ్చారు. టిడిపి ప్రభుత్వం వచ్చిన వెంటనే వైసిపి ఈ మాఫియాపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.


# విష్ణువర్ధన్ రెడ్డి యత్నం...కమలం గూటికి కిరణ్

అనంతపురం, ఏప్రిల్ 8, ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి భారతీయ జనతా పార్టీలో చేరడం అనూహ్య పరిణామం. ఆయన కాంగ్రెస్ పార్టీకి వీర విధేయుడు. రాష్ట్ర విభజన నిర్ణయంతో పార్టీపై విశ్వాసం కోల్పోయారు. తర్వాత మళ్లీ కాంగ్రెస్ పార్టీలో చేరినా యాక్టివ్ కాలేకపోయారు. కాంగ్రెస్ హైకమాండ్ తన సూచనలు పట్టించుకోకపోవడం ఎలాంటి బాధ్యతలు ఇవ్వకపోవడంతో ఆయన సైలెంట్ అయిపోయారు. అయితే బీజేపీలో చేరడం మాత్రం అనూహ్యం. కిరణ్‌ను బీజేపీలోకి తీసుకురావడంలో ఏపీబీజేపీ ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి కీలక పాత్ర పోషించారు. ఆయన నిరంతరం.. అటు హైకమాండ్‌తో ఇటు కిరణ్ కుమార్ రెడ్డితో చర్చలు జరిపి బీజేపీలో చేరికకు మార్గం సుగమం చేసినట్లుగా తెలుస్తోంది. విష్ణువర్ధన్ రెడ్డి విద్యార్థి దశ నుంచి రాజకీయాల్లోకి వచ్చారు. సమైక్యాంధ్ర ఉద్యమంలో ఆయన కీలకపాత్ర పోషించారు. కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే రాష్ట్ర విభజన జరిగింది. అయితే ఈ విభజనను కిరణ్ కుమార్ రెడ్డి వ్యతిరేకించారు. ఆ సమయంలో సమైక్యాంధ్ర ఉద్యమం ప్రారంభించారు. ఆ సమయంలో పదవులు ఉన్న కాంగ్రెస్ పార్టీ నేతలు ఎవరూ కిరణ్ కుమార్ రెడ్డితో నడవడానికి ముందుకు రాలేదు. కానీ రాయలసీమ జిల్లాల నుంచి విష్ణువర్ధన్ రెడ్డి.. కిరణ్ కుమార్ రెడ్డి చేపట్టిన సమైక్య ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. ఆ సమయంలో కిరణ్ కుమార్ రెడ్డికి విష్ణువర్ధన్ రెడ్డి సన్నిహితమయ్యారు. అప్పట్నుంచి ఉన్న సన్నిహిత సంబంధాలతో ఇప్పుడు పార్టీని బలోపేతం చేయడానికి విష్ణువర్ధన్ రెడ్డి ఉపయోగించుకున్నారు. సమైక్యాంధ్ర ఉద్యమం తర్వాత రాష్ట్ర విభజన జరగడంతో పూర్తి స్థాయిలో బీజేపీలో యాక్టివ్ అయిన విష్ణువర్ధన్ రెడ్డి నెహ్రూ యువ కేంద్ర వైస్ చైర్మన్‌గా సమర్థంగా పని చేస్తూ జాతీయ స్థాయి నేతల అభిమానాన్ని చూరగొన్నారు. పార్టీ బలోపేతం కోసం విష్ణువర్ధన్ రెడ్డి కష్టపడే తీరు పెద్దలకు నచ్చింది. కిరణ్ కుమార్ రెడ్డి బీజేపీలో చేరితే మంచి ఫలితాలు వస్తాయని ఆయన భావించారు. మొదట కిరణ్ కుమార్ రెడ్డిని సంప్రదించారు. ఏపీలో బీజేపీ ఎదడగానికి ఉన్న అవకాశాలపై చర్చించి.. పార్టీలో చేరేలా ఒప్పించారు. తర్వాత విష్ణువర్ధన్ రెడ్డి బీజేపీ హైకమాండ్ పెద్దలతోనూ మాట్లాడారు. నిజానికి మాజీ ముఖ్యమంత్రి స్థాయి నేతను పార్టీలో చేర్చుకోవాలంటే చిన్న విషయం కాదు. ఎందుకంటే పార్టీలో చేరే ఆ నేతకు సముచిత గౌరవం ఇవ్వాల్సి ఉంటుంది. ఇలాంటి సమస్యలన్నింటినీ విష్ణువర్ధన్ రెడ్డి పరిష్కరించారు. ఇటు కిరణ్ రెడ్డితో అటు హైకమాండ్‌తో సంప్రదింపులు జరిపి చివరికి లైన్ క్లియర్ చేశారు. ఆయన పట్టుదల ఫలించి కిరణ్ కుమార్ రెడ్డి బీజేపీ సభ్యుడయ్యారు. అందుకే ఢిల్లీలో కిరణ్ రెడ్డి బీజేపీలో చేరిక సమయంలో కూడా విష్ణువర్ధన్ రెడ్డి కీలకంగా వ్యవహరించారు.

# వైజాగ్ స్టీల్ ప్లాంట్ పై బీఆర్ఎస్ లవ్వు

విశాఖపట్టణం, ఏప్రిల్ 8,వైజాగ్ స్టీల్ ప్రైవేటీకరణను బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని తెలంగాణ ఐటీ మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించిన రెండు రోజుల బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ వైజాగ్ లో బహిరంగ సభ నిర్వహించాలని డిసైడ్ చేయడం వెనుక..స్టీల్ ప్లాంట్ ను కాపాడుకోవాలనే ఆత్రం కన్నా.. తమ పార్టీని ఏపీలో విస్తరించాలన్న ఆరాటమే ఎక్కువగా కనిపిస్తోంది. స్టీల్ ప్లాంట్ కార్మికులకు మద్దతుగా కేసీఆర్ బహిరంగ సభ నిర్వహించేందుకు నిర్ణయించారు.ఆ సభను ఈ నెలలోనే అంటే ఏప్రిల్ లోనే నిర్వహించేందుకు ఏపీ బీఆర్ఎస్ అప్పుడే ప్రయత్నాలు ముమ్మరం చేసింది. అయితే ఇది స్టీల్ ప్లాంట్ కార్మికుల కోసం కాదు.. ఏపీలో పార్టీ విస్తరణకేనని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. అయితే బీఆర్ఎస్ వర్గాలు మాత్రం వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న కార్మికులకు సంఘీభావంగా ఈ సభ నిర్వహిస్తున్నట్లు చెప్తున్నాయి. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సాగుతున్న ఉద్యమంలో బీఆర్ఎస్ ఏపీ శాఖ భాగస్వామ్యం అయ్యింది. కేంద్రం లోని మోడీ సర్కార్ అన్ని ప్రభుత్వరంగ సంస్థలను తన కార్పొరేట్ మిత్రులకు అప్పనంగా కట్టబెడుతోందని ఇటీవల కేసీఆర్, కేటీఆర్ అన్ని వేదికలపైనా విమర్శలు గుప్పిస్తున్నారు. ఖమ్మంలో నిర్వహించిన బీఆర్ఎస్ బహిరంగ సభ తర్వాతే వైజాగ్లో పార్టీ బహిరంగ సభ నిర్వహించాలని భావించినా ఆ తరువాత మళ్లీ ఇప్పటి దాకా కేసీఆర్ ఆ ఊసే ఎత్తలేదు.మహారాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారించిన కేసీఆర్.. నాందేడ్ జిల్లాలో సభలు ఏర్పాటు చేశారు. ఇప్పుడు వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాన్ని అస్త్రంగా చేసుకొని ఏపీలో పార్టీ ప్రస్థానం షురూ చేసే ప్ర యత్నాల్లో ఉన్నారు. సభకు సంబంధించిన ఏర్పాట్ల ను ఏపీ బీఆర్ఎస్ చీఫ్ తోట చంద్రశేఖర్, ఇతర నేతలకు అప్పగించినట్లు చెబుతున్నారు. ఈ నెలలోనే కేసీఆర్ సభ ఉండే అవకాశముందని అంటున్నారు. తెరాస బీఆర్ఎస్ గా మారిన తర్వాత కేసీఆర్ ఏపీపైనే ఫోకస్ పెట్టారు. పలువురు నాయకులను చేర్చుకోవడంతో పాటు పెద్ద ఎత్తున సిట్టింగ్ ఎమ్మెల్యేలు తనతో టచ్ లో ఉన్నారని బాంబు పేల్చారు. అయితే, దీనికి ఏపీ ఎమ్మెల్యేలు, ఇతరుల నుంచి పెద్దగా రెస్పాన్స్ రాలేదు. ఏపీలో జనసేన చీఫ్ పవన్ కల్యాణ్ తో బీఆర్ఎస్ కలిసి పనిచేయబోతోంద నే ప్రచారం సాగినా అది వాస్తవం కాదని వెంటనే తేలిపోయింది. దీంతో కేసీఆర్ ఏపీలో పార్టీ విస్తరణ ప్రయత్నాలను తగ్గించారనే ప్రచారమూ జరిగింది. ఇప్పుడు ఏపీలో పార్టీ విస్తరణ కు తెలంగాణ సీఎం కేసీఆర్ నడుంబిగించారని పార్టీ వర్గాలు గట్టిగా చెబుతున్నాయి. గద్వాల జిల్లాతో పాటు ఏపీలోని ఉమ్మడి కర్నూల్ జిల్లాలో ప్రభావం చూపగల చల్లా వెంకట్రామిరెడ్డికి ఎమ్మెల్సీ పదవి ఇవ్వడానికి కూడా అదే కారణమని అంటున్నారు. అయితే ఏపీలో మళ్లీ అధికారం నిలబెట్టుకోవాలని వైసీపీ, గత ఏడాది ఒంగోలు మహానాడు సక్సెస్ తర్వాత .. జనంలో పాపులారిటీ క్రమంగా పెంచుకుంటున్న తెలుగుదేశం, ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా చూస్తాం అంటూ జనసేన ఇలా ఏపీలోని మూడు ప్రధాన పార్టీల హోరులో బీఆర్ఎస్ వెంట నడిచేవారెవరుంటారన్న సందేహాన్ని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

# నేడు కేంద్ర మాజీ మంత్రి టైగర్ ఆలె నరేంద్ర వర్ధంతి




ఆలె నరేంద్ర 1946, ఆగష్టు 21న హైదరాబాదులోని నారాయణగూడలో పుష్పవతి, రామలింగం దంపతులకు జన్మించారు. ఇంటి పేరు ఆలె బదులు అంతా టైగర్ నరేంద్ర అని పిలిచేవారు. స్థానికంగా హైదరాబాదులోనే ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బియస్సీ పూర్తిచేశారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ క్రియాశీలక కార్యకర్తగా పదిహేడేళ్ల వయసులో రాజకీయాల్లోకి వచ్చారు. సిమ్లా ఒప్పందానికి వ్యతిరేకంగా సాగిన ఉద్యమంలో పాల్గొని తీహార్ జైల్లో నెలపాటు శిక్షననుభవించారు. 1975లో ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా ఉద్యమించి 18 నెలలపాటు జైల్లో ఉన్నారు. 1969-1972 వరకూ జన్‌సంఘ్‌కు ఫుల్‌టైమర్‌గా పని చేశారు. జనసంఘ్ జనతా పార్టీలో విలీనమైన తర్వాత 1980లో మొదటిసారిగా ఆ పార్టీ అభ్యర్థిగా హైదరాబాద్ పార్లమెంట్‌కు పోటీ చేసి ఓడిపోయారు. 2003 వరకు భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ విభాగములో చెప్పుకోదగిన పాత్ర పోషించారు. నరేంద్ర 2004 సార్వత్రిక ఎన్నికలకు ముందు బీజేపీ నుండి బయటికి వచ్చి ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర సాధనకై తెలంగాణ సాధన సమితి అనే ఒక రాజకీయ వేదికను ప్రారంభించాడు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం పతాకస్థాయిలో ఉన్న దశలో తను స్థాపించన వేదికను కె.చంద్రశేఖరరావు ప్రారంభించిన తెలంగాణ రాష్ట్ర సమితిలో విలీనం చేశారు. ప్రారంభం నుంచి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సభ్యుడైన నరేంద్ర 1983 నుంచి 1994 మధ్యకాలంలో భారతీయ జనతా పార్టీ తరఫున ఆంధ్రప్రదేశ్ శాసనసభకు హిమాయత్‌నగర్ నియోజకవర్గం నుంచి మూడు పర్యాయాలు ఎన్నికైనాడు. 1978లో ఖైరతాబాదు నియోజకవర్గంలో పోటీ చేసి కాంగ్రెస్ పార్టీకి చెందిన పి.జనార్ధనరెడ్డి చేతిలో కేవలం 659 ఓట్ల తేడాతో ఓడిపోయారు. 1980లో హైదరాబాదు లోక్‌సభ నియోజకవర్గంలో పోటీ చేసి కాంగ్రెస్ పార్టీకి చెందిన కె.ఎస్.నారాయణ చేతిలో పరాజయం పొందారు. 1983లో హిమయత్ నగర్ శాసనసభ నియోజకవర్గం నుంచి పోటీ చేసి పి.ఉపేంద్ర పై గెలుపొంది శాసనసభలో అడుగుపెట్టారు. 1985లో మళ్ళీ అదే స్థానం నుంచి పోటీ చేసి కె.ప్రభాకరరావుపై గెలుపొందాడు. 1992లో హిమయత్ నగర్ శాసనసభ నియోజకవర్గంలో గెలుపొంది మూడవసారి శాసనసభలో అడుగుపెట్టాడు. 1994లో తెలుగుదేశం పార్టీకి చెందిన కృష్ణయాదవ్ పై ఓడిపోయాడు.1999లో భారతీయ జనతా పార్టీ తరఫున లోక్‌సభకు కాంగ్రెస్ పార్టీకి చెందిన బాగారెడ్డిపై విజయం సాధించి తొలిసారి లోక్‌సభ సభ్యులైయ్యారు. 2003 వరకు భారతీయ జనతా పార్టీలో మంచి పేరు సంపాదించుకొని అభిమానులచే టైగర్‌గా పిలుపించుకున్నాడు. ప్రత్యేక తెలంగాణా వాదంతో కె.చంద్రశేఖర్ రావు ప్రారంభించిన పార్టీలో చేరి ఆ పార్టీలో రెండో ముఖ్య నాయకుడిగా వ్యవహరించారు. 2004లో మళ్ళీ మెదక్ నియోజకవర్గం నుంచి తెలంగాణ రాష్ట్ర సమితి తరఫున పోటీ చేసి భారతీయ జనతా పార్టీకు చెందిన పి.రామచంద్రారెడ్డిపై 1,23,756 ఓట్ల మెజారిటీతో గెలిచి రెండో పర్యాయం లోక్‌సభలో అడుగుపెట్టడమే కాకుండా మే 23 న కేంద్రంలో మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యుపిఏ ప్రభుత్వంలో గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రిపదవిని పొందారు.నకిలీ వీసా కేసులో చిక్కుకొని ఏప్రిల్ 2007లో తెలంగాణా రాష్ట్ర సమితి నుంచి బహిష్కృతుడై , ఆ తర్వాత తెలంగాణ రాష్ట్ర సమితి (నరేంద్ర) అనే కొత్త పార్టీని స్థాపించాడు. ఆ పార్టీకి జనాదరణ లభించకపోవడంతో 2008 జనవరి 8న హైదరాబాదులో మాయావతి సమక్షంలో బహుజన సమాజ్ పార్టీలో చేరారు. అమెరికాతో అణుఒప్పందం విషయంలో వామపక్షాలు యు.పి.ఏ.ప్రభుత్వానికి మద్దతును ఉపసంహరించుకున్న పిదప జరిగిన పరిణామాలతో నరేంద్ర యు.పి.ఏ.ప్రభుత్వానికి మద్దతు ఇచ్చి ఆ అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరాడు. 2009 ఎన్నికలకు ముందే కాంగ్రెస్ పార్టీ తరఫున రాజ్యసభకు ఎన్నికైయ్యాడు. అనంతర కాలంలో భారతీయ జనతా పార్టీలో చేరి పనిచేశాడు.అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌కు చెందిన నాంపల్లి లోని కేర్ ఆసుపత్రిలో ఏప్రిల్ 9, 2014న మరణించారు.

# రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి..ఎనిమిది మందికి గాయాలు

నెల్లూరు ఉమ్మడి నెల్లూరు జిల్లా చిల్లకూరు మండలం జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం కూలీలతో వెళుతున్న ఆటోను ట్రాలీ వాహనం ఢీ కొట్టింది. ఘటనలో ఒకరు మృతి చెందారు. ఎనిమిది మందికి గాయాలు అయ్యాయి. బాధితులంతా మిరప పంట కోయడానికి నక్కల వారి కండ్రిగ గ్రామం నుంచి నాంచారం పేట వెళుతుండగా ప్రమాదం జరిగింది. మృతురాలు నక్కల వారి కండ్రిగ కు చెందిన కత్తిపోలమ్మ (42). చిల్లకూరు మండలం వరగలి క్రాస్ రోడ్ సమీపంలో జాతీయ రహదారిపై మిరపకోతకు కూలీలతో వెళుతున్న ఆటో రోడ్డు సైడ్ న ఆపి ఉండగా గుర్తు తెలియని ట్రాలీ వాహనం కూలీల ఆటోను ఢీ కొట్టిన ఘటనలో నక్కల వారి కండ్రిగ కు చెందిన కత్తి పోలమ్మ 42 అనే మహిళ ఘటనా స్థలం లోనే మృతిచెందగా మరో ఎనిమిది మంది కూలీలకు కూడా గాయాలయ్యాయి, కూలీలు నక్కల వారి కండ్రిక గ్రామానికి చెందినవారు వారిలో ఒకరు మాత్రం రెట్టపల్లికి చెందినవారు, వీరు మరో ఇద్దరు కూలీల కోసం రోడ్డు పక్కన ఆగి ఉన్న క్రమంలో లారీ ఢీకొట్టినట్టు సమాచారం...ప్రమాద సమయంలో కూలీలు తెచ్చుకున్న అన్నం బాక్సులు నీళ్ల బాటిల్లు కింద పడిపోయి ఘటనా స్థలం హృదయవిదారకంగా తయారైంది. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని చిల్లకూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం..

# బేడిలతో నిందితుడు పరారీ

విశాఖపట్నం విశాఖపట్నం నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ నుంచి గంజాయి కేసులో నిందితుడు. బేడిలతో పరారైయాడు. నిందితుడు చోడవరం కు చెందిన సత్తిబాబు. బహిర్భూమికి వెళ్తానని చెప్పి పోలీసులకు కళ్ళు కప్పి పరారీ అయ్యాడు. బేడిలతో సహ సత్తిబాబు కనిపించడంతో కొంతమంది పట్టుకునేందుకు ప్రయత్నించారు. వారిని సైతం తప్పించుకుని పరారైయాడు. బస్ కాంప్లెక్స్, రైల్వే స్టేషన్ ల్లలో నిందితుడు కోసం పోలీసులు గాలింపు చేపట్టారు.

# కడప నగరంలో ఉద్రిక్తత

## వామపక్ష నేతలను అడ్డుకున్న పోలీసులు

కడప కడపలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, ఇతర వామపక్ష నాయకులను పోలీసులు అరెస్ట్ చేసారు. శుక్రవారం నాడు కర్నూలులో డాక్టర్ అచ్చన్న కుటుంబ సభ్యులను పరామర్శించిని వామపక్ష నేతలు శనివారం కడపకు చేరుకున్నారు. పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ అచ్చన్న మృతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని.. వామపక్షాలు, దళిత సంఘాలు కడపలో భారీ ర్యాలీకి పిలుపునిచ్చారు. ర్యాలీ, నిరసనకు పిలుపుతో కడపలోని ఓ హోటలులో బసచేసిన సీపీఐ రామకృష్ణను, ఇతర పార్టీ నేతలను అరెస్ట్ చేసేందుకు పోలీసులు పెద్ద ఎత్తున వచ్చారు. మరోవైపు రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి హౌస్ అరెస్ట్ అయ్యారు. ఎవ్వరు అడ్డుకున్నా ర్యాలీ నిర్వహించి తీరుతామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు.

కోళ్ల ఫారం దగ్ధం.

# బాధితులను పరామర్శించిన ఉప ముఖ్యమంత్రి

ఏలూరు పశ్చిమ గోదావరి జిల్లాలోని దేవరాపల్లి మండలంలోని ఏ.కొత్తపల్లి గ్రామానికి చెందిన కోళ్ల ఫారం రైతు గోకాడ ప్రసాద్ కోళ్ల షెడ్డు నిన్న మధ్యాహ్నం సమయంలో అగ్నిప్రమాదనికి గురై పూర్తి దగ్ధమైంది. ఈ ఘటనలో 10 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిలిందని సదరు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ఘటన స్థలానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించి, వారిని ఓదార్చారు.

## రాయలసీమ హక్కులకై ఈనెల 24న జరిగే నిరసన దీక్షను విజయవంతం చేయండి.

### రోడ్ కం బ్యారేజ్ ను నిర్మించాలి
### అప్పర్ భద్ర ప్రాజెక్ట్ ను నిలుపుదల చేయాలి
### శ్రీబాగ్ ఒప్పందాన్ని పూర్తిగా అమలు చేయాలిరాయలసీమ స్టీరింగ్ కమిటీ నాయకులు ఆర్ వివెస్ సీమకృష్ణ

నందవరం, ఏప్రిల్ 08 (విభారే న్యూస్:రాయలసీమ హక్కులకై కర్నూలు పట్టణంలో ఏప్రిల్ 24న జరిగే ఒకరోజు నిరసన దీక్షను విజయవంతం చేయాలని రాయలసీమ స్టీరింగ్ కమిటీ నాయకులు కోరారు. ఈ సందర్భంగా రాయలసీమ స్టీరింగ్ కమిటీ నాయకులు ఆర్ వి ఎస్ సీమకృష్ణ మాట్లాడుతూ సిద్దేశ్వరం సంగమేశ్వరం వద్ద కృష్ణా నదిపై ఐకానిక్ బ్రిడ్జి బదులు రోడ్డు కం బ్యారేజ్ నిర్మించాలని మరియు అప్పర్ భద్ర ప్రాజెక్టును కర్ణాటక ప్రభుత్వం నిర్మించడం వలన రాయలసీమకు తుంగభద్ర నది నుండి రావాల్సిన నికర జలాలు హెచ్.ఎల్.సి,ఎల్ఎల్సి మరియు కేసీ కెనాల్ బైరవాణి తిప్ప ప్రాజెక్టుకు రైతులకు నీళ్లు రావన్నారు.వెంటనే ఆ ప్రాజెక్టును నిలుపుదల చేయాలని కోరుతూ మరియు శ్రీబాగ్ ఒప్పందాన్ని పూర్తిగా అమలు చేసి నీళ్లు,నిధులు, నియామకాల లో న్యాయం చేయాలని కోరుతూ ఈనెల ఏప్రిల్ 24వ తారీఖున కర్నూలు పట్టణంలో రాయలసీమ స్టీరింగ్ కమిటీ చైర్మన్ బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఒక్కరోజు నిరసన దీక్ష కార్యక్రమంను చేపడుతున్నామని ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో హరి నాయుడు నాగభూషణం, గోపాల్, సురేందర్ రెడ్డి, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మేఘన స్పోర్ట్స్ ఆధ్వర్యంలో ఘనంగా అల్లు అర్జున్ జన్మదిన వేడుకలు



ఎమ్మిగనూరు ఏప్రిల్ 08, ( విబారే న్యూస్) ఎమ్మిగనూరు పట్టణంలోని బస్టాండ్ ఇన్ గెట్ ఎదురుగా ఉన్న మేఘన స్పోర్ట్స్ ఆధ్వర్యంలో స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ జన్మదిన వేడుకలను కేక్ కట్ చేసి ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మేఘన స్పోర్ట్స్ వీరారెడ్డి, మాట్లాడుతూ అల్లు అర్జున్, తన నటనతో అందరిని ఆకట్టుకున్నారని ఎలాంటి పాత్ర పోషించినా ఆ పాత్రలో ఇట్టే ఒదిగిపోతారని తన డ్యాన్స్ కు కుర్రాళ్లు ఊగిపోతారని అలాంటి అల్లు అర్జున్, ఎల్లప్పుడూ ఆయు ఆరోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటునట్లు తెలిపారు, అలాగే రాబోయే రోజుల్లో ఆయన నటించిన సినిమాలు ఘన విజయాలు సాధించి మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మేఘన స్పోర్ట్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

### - పాఠశాల తనిఖీలో విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్




పత్తికొండ ఏప్రిల్ . విభారే న్యూస్ )ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న విద్యా విధానాన్ని విద్యార్థులకు విద్య సక్రమంగా అందించాలని పాఠశాల విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఉపాధ్యాయులను ఆదేశించారు. శనివారం పత్తికొండ మండల పరిధిలో హోసూర్ గ్రామంలో. ఉన్నత పరిషత్ పాఠశాలను పాఠశాలలను విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు విద్యను నేర్పడంలో వెనకబడ్డారు. నాడు నేడు కింద చేపట్టిన నిర్మాణాలు నాణ్యతగా లేవు. వేసిన రంగులు తేలి పోయాయి. వచ్చిన నిధులను మింగేసారా? అంటూ అనుమానాలు వ్యక్తం చేశారు. నాలుగో తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. ఆయన పాఠ్యాంశంలోని కొన్ని ప్రశ్నలకు విద్యార్థుల నుంచి సమాధానం రాబట్టారు. సిలబస్ పూర్తికాకుండా ఫార్మేటివ్ పరీక్షను విద్యార్థులు ఎలా రాస్తారని, సిలబస్ పూర్తి చేయనందుకు ఉ ?ధ్యాయుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. క్లాస్ టీచర్ విద్యార్థులకు సకా లంలో విద్యాబోధన పూర్తి చేశారా లేదా విషయాన్ని హెచ్ఎం, ఎంఇఒ, డిప్యూటీ డిఇఒ ఎందుకు పర్యవేక్షణ చేయలేదని మండిపడ్డారు. విద్యార్థులను ఉ పాధ్యా యులు సొంత బిడ్డల్లా చూసుకోవాలని సూచించారు. నిర్లక్ష్యంగా ఉన్న ఉపాధ్యా యులు, హెచ్ఎం, ఎంఇఒ, డిప్యూటీ డిఇఒలపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. రూ.కోట్లు ఖర్చుపెట్టి వర్క్ బుక్స్ అందిస్తే వినియోగించరా? ఉపాధ్యాయులకు బాధ్యత లేదా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన గుణా త్మక విద్య ప్రభుత్వ లక్ష్యంగా అనేక సంస్కరణలు ప్రభుత్వం తీసుకువస్తోందని పేర్కొన్నారు. విద్యకు ప్రాధాన్యమిస్తున్న ప్రభుత్వానికి మచ్చ తెస్తున్నారు, ఉపాధ్యాయులు కొంత మంది నిర్లక్ష్యంగా వ్యవ హరించడం సరైన పద్ధతి కాదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా ఉన్న వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసిన విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్

### విద్యార్థులతో సంభాషించిన ప్రిన్సిపల్ సెక్రెటరీ
### కస్తూరిబాలో మధ్యాహ్న భోజనం పథకం పరిశీలన

తుగ్గలి మండల కేంద్రంలో గల పాఠశాలలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ శనివారం రోజున ఆకస్మికంగా చేశారు.ముందుగా 10వ తరగతి పరీక్ష కేంద్రమైన నోవి పాఠశాలను తనిఖీ చేసి పరీక్షలు నిర్వహణ తీరు గురించి తెలుసుకున్నారు.అనంతరం తుగ్గలిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలొ పదవ తరగతి పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.అనంతరం పాఠశాలలో గల సౌకర్యాలు గురించి అధ్యాపకుల ద్వారా వివరాలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం మండల పరిధిలోని గల కస్తూరిబా పాఠశాలను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి పాఠశాలలో గల సౌకర్యాలు గురించి మరియు మధ్యాహ్న భోజనం పథకం గురించి భక్తుల ద్వారా వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కస్తూరిబా పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం భోజనాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయుల పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఆయన తెలియజేశారు. వసతి గృహాల్లో నాణ్యమైన విద్యను మరియు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఆయన ఉపాధ్యాయులకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఆర్జెడి ప్రతాప రెడ్డి,డీఈవో రంగారెడ్డి,ఏపీసి వేణుగోపాల్, డిప్యూటీ ఈవో సుకుమార్,డిఈ కర్రెన్న,ఎంఈఓ రమా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## నిత్య అన్నదానంలో సిబ్బంది చేతివాటం

చిత్తూరు కాణిపాకం దేవస్థానం నిర్వహిస్తున్న నిత్య అన్నదానం లో పనిచేస్తున్న సిబ్బంది చేతివాటం చూపించడం చర్చనీయాంశమయింది. పలువురు సిబ్బంది అన్నదానం లో నిత్యావసర వస్తువుల దొంగతనాలకు పాల్పడినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో కార్యనిర్వహణ అధికారి వెంకటేష్, ఇతర ఆలయ అధికారులు అనుమానిత సిబ్బంది ఇళ్లల్లో తనిఖీ లు జరిపారు. భారీగా సామాగ్రి స్వాధీనం చేసుకున్నాడు.

## రన్ ఫర్ జీసస్ లో పాల్గొన్న కర్నూల్ సెక్యూలర్ లీడర్ శ్రీ ఎస్ వి మోహన్ రెడ్డి



కర్నూల్ ఏప్రిల్ 8. విభారే న్యూస్... లోక రక్షకుడు అయిన యేసు క్రీస్తు పునరుత్థానం కొరకు నిర్వహించిన 13 వ రన్ ఫర్ జీసస్ కార్యక్రమం లో మాజీ ఎమ్మెల్యే శ్రీ ఎస్ వి మోహన్ రెడ్డి మాజీ ఎమ్మెల్సీ శ్రీ సుధాకర్ బాబు మరియు రెవరెండ్ సజీవ రాజు లతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రపంచానికి శాంతి సందేశం పంపిన యేసు ప్రభువు పునరాత్తనం కొఅకు చేపట్టిన జీసస్ ఫర్ రన్ కార్యక్రమం విజయ వంతం కావాలని పిలునిచ్చారు. కార్యక్రమం లో కన్వీనర్ సుధీర్ బాబు సెక్రటరి జయకర్ ట్రెజరర్ సురేష్ బాబు, చర్చి ఫాస్టర్ ఆంటోనీ రాజు,హోసన్న చర్చి ఫాస్టర్ ప్రెడి పాల్ , అూవి చర్చి కరుణాకర్ బాబు రాక్ వుడ్ చర్చి అధ్యక్షుడు పి.ఆనంద రావు, మన్నా చర్చి ఫాదర్ విలియమ్స్ , బాలరాజు పరశురామ్ యేసు సత్య రాజు వనేష్ సుశాంత్ రాజ్ ఎల రమణ గద్ద రాజశేఖర్ కంటు దాసు నాగరాజు సుంకన్న షెక్షా రాజేష్ స్వామి షోహెల్ తదితరులు పాల్గొన్నారు

## ఇబ్బందులు లేకుండా పరీక్షల నిర్వహణ

### 'పది' పరీక్ష కేంద్రాలలో గ్రామీణ సీఐ ఆకస్మిక తనిఖీ

నందికొట్కూరు పదవ తరగతి పరీక్షల సందర్భంగా నందికొట్కూర్ మండలంలోని బ్రాహ్మణ కొట్కూర్ జిల్లా పరిషత్ హైస్కూల్ పదవతరగతి పరీక్ష కేంద్రాలను శనివారం జిల్లా గ్రామీణ సీఐ సుధాకర్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు.పరీక్షలు జరుగు విధానాన్ని అక్కడ ఉన్న అధికారులను, అడిగి తెలుసుకొని పోలీస్ బందోబస్తును తనిఖీ చేసి భద్రతాపరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ. నందికొట్కూరు సర్కిల్ పరిధిలో పదవ తరగతి పరీక్ష కేంద్రాల వద్ద ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, పరీక్షా కేంద్రాల్లోకి సెల్ ఫోన్ లను అనుమతించరాదని, ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. పరీక్షా కేంద్రం చుట్టూ 100 మీటర్ల వరకు ఎవరిని లోపలికి రానివ్వకుండా విధులు నిర్వర్తించాలని అన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉన్నందున ఎవరు గుంపులు గుంపులుగా ఉండరాదని సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ కొట్కూరు ఎస్సై ఓబులేసు పోలీస్ సిబ్బంది సతీష్ తదితరులు పాల్గొన్నారు


# సల్మాన్ ఖాన్ ఇంట బుల్లెట్ ప్రూఫ్ కారు..కారణాలు అవేనా?



బాలీవుడ్ హీరో సల్మాన్ ఖాన్ ఖరీదైన హైఎండ్ బుల్లెట్ ప్రూఫ్ కారు కొనుగోలు చేసినట్లు తెలుస్తుంది. ఈ కారు ఇంకా ఇండియాలో అందుబాటులో లేదు. నిస్సాన్ పెట్రోల్ ఎస్ యూవీని విదేశాల నుంచి దిగుమతి చేస్తున్నారు. మరి ఉన్నట్లుండి భాయ్ ఈ కోరు ఎందుకు కొనుగోలు చేసినట్లు? ఇంట్లో కావాల్సినన్ని కార్లు ఉండగా కొత్తగా హైఎండ్ మోడల్ బుల్లెట్ ప్రూవ్ ఎందుకు విక్రయిస్తున్నట్లు? అంటే చాలా సంగతులే ఉన్నాయి.సల్మాన్ ఖాన్ ఇంట్లో కార్లకు కొదేముంటుంది. ఖరీదైన లగ్జీరియస్ కార్లు ఎన్నో ఉన్నాయి. వాటి ధర కోట్లలో ఉంటుంది. అలాగని సల్మాన్ ఏమీ కార్లు ప్రియుడు కాదు. పేరుకే కార్లు ఉంటాయి. కానీ ఆయన చాలా సింపుల్ గా ఉంటాడు. మరి ఈ బుల్లెట్ ప్రూఫ్ కారు ఉన్న పళంగా కొనడం దేనికంటే? ఓ ఇంట్రెస్టింగ్ మ్యాటర్ ఉంది. సల్మాన్ ఖాన్ కి ఈ మధ్య అపరిచుతుల నుంచి బెదిరింపు కాల్స్..లేఖలు ఎక్కువగా వస్తోన్న సంగతి తెలిసిందే.ఇదే ఏడాది ఇప్పటివరకూ మూడుసార్లు బెదిరింపు కాల్స్ వెళ్లాయి. ఓ పార్క్ లో తృటిలోనే తప్పించుకున్నారు. గ్యాంగ్ స్టర్ లారెన్స్ బిష్ణోయ్ నుంచి సల్మాన్ కి ప్రమాదం పొంచి ఉన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే పలు హత్య కేసుల్లో నిందుతుడుగా ఉన్న బిష్ణోయ్ ని సల్మాన్ ఖాన్ ని కూడా బెదిరించాడు. అరెస్ట్ అయి జైలు లో ఉన్నా సల్మాన్ ని నీడలా బిష్ణోయ్ అనుచరలు వెంటాడుతూనే ఉన్నారు.సల్మాన్ ప్రతీ కదలిక జైలు లో ఉన్న బిష్ణోయ్ కి తెలుస్తోంది. జైలు నుంచే వార్నింగ్ లు ఇచ్చిన సందర్భాలున్నాయి. బయట స్వేచ్ఛగా తిరగాలంటే చేసిన తప్పు ఒప్పుకుని క్షమాపణలు కోరాలని ..అప్పటి వరకూ తన కోపం చల్లారనది బిష్ణోయ్ హెచ్చరించారు. అటుపై సల్మాన్ మెయిల్ ఖాతాకి మరో బెదిరింపు లేక మరోరూపంలో ఇటీవలే వెళ్లింది. ఇలాంటి పరిణమాల నేపథ్యంలో ముంబై పోలీసులు సల్మాన్ కి భద్రత మరింత పటిష్టం చేసారు.అలాగే సల్మాన్ వ్యక్తిగత భద్రతా సిబ్బందిని పెంచుకున్నారు. ఈ పరిణామాలన్నింటి నేపథ్యంలో సల్మాన్ బుల్లెట్ ప్రూఫ్ కొన్నట్లు తెలుస్తోంది. తుపాలకుతో గుళ్ల వర్షం కురిపించినా ప్రాణహని ఉండదని విదేశాల నుంచి ఈ కారుని దిగుమతి చేస్తున్నారు. ఇలాంటి బెదిరింపులు భాయ్ కి కొత్త కాదు. కానీ ఈసారి సన్నివేశం పాత తరహాలో కనిపిస్తుంది. అందుకే తన రక్షణకు అవసరమైన సరంజామాని సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది.





# మరో బయోపిక్ కి రెడీ అవుతున్న సీనియర్ స్టార్




రాకెట్రీ : ది నంబి ఎఫెక్ట్ తో ఇటీవలే ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఆర్ మాధవన్ సక్సెస్ ను దక్కించుకున్న విషయం తెల్సిందే. మాధవన్ కెరీర్ ఖతం.. ఆయన క్యారెక్టర్ ఆర్టిస్టుగా సినిమాలు చేసుకోవాల్సిందే అంటూ అంతా భావిస్తున్న సమయంలో అనూహ్యంగా వచ్చిన రాకెట్రీ సినిమా తో భారీ విజయాన్ని సొంతం చేసుకున్న విషయం తెల్సిందే.నంబి నారాయణ పాత్రలో మాధవన్ నటించి మెప్పించాడు. ఇన్నాళ్లు నంబి నారాయణ గురించి ప్రపంచానికి తెలియని విషయాలను మాధవన్ చూపించాడు. బయోపిక్ అయినా కూడా రెగ్యులర్ కమర్షియల్ సినిమా మాదిరిగా స్క్రీన్ ప్లే నడిపించి మెప్పించాడు. బయోపిక్ తో సక్సెస్ ను దక్కించుకున్న మాధవన్ మరో బయోపిక్ తో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీ అవుతున్నాడు.మాధవన్ ప్రస్తుతం ఎడిసన్ ఆఫ్ ఇండియాగా పేరు దక్కించుకున్న జి డి నాయుడు పాత్రలో నటించేందుకు రెడీ అవుతున్నాడట.కోయంబత్తూర్ యొక్కత సంపద సృష్టికర్త అయిన నాయుడు మన దేశ వారసత్వం అయిన మొట్ట మొదటి ఎలక్ట్రిక్ మోటారు తయారికి సంబంధించిన వ్యక్తి అనే విషయం తెల్సిందే.జి డి నాయుడు ఒక పారిశ్రామిక వేత్త అయినా కూడా ఆయన జీవితంలో అనేక ఆసక్తికర అంశాలు ఉన్నాయని... ఎన్నో రంగాల్లో ఆయన కృషి అద్భుతం అని అందుకే ఆయన జీవితాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చేందుకు మాధవన్ ప్రయత్నాలు చేస్తున్నాడు అంటూ సమాచారం అందుతోంది.వ్యవసాయ రంగం తో పాటు ఎన్నో రంగాల్లో ఇప్పటికి కూడా జి డి నాయుడు విప్లవాత్మక ఆవిష్కరణలు ఎంతో ఉపయోగ దాయకంగా ఉన్నాయి. ఈ బయోపిక్ ను కూడా పాన్ ఇండియా రేంజ్ లో రూపొందించబోతున్నట్లుగా తెలుస్తోంది.

# శ్రీలంకతో న్యూజిలాండ్ మూడో టీ20.. మ్యాచ్ మధ్యలో విమానం



క్వీన్స్‌టౌన్‌లోని జాన్ డేవిస్ మైదానంలో ఇవాళ (ఏప్రిల్ 10) న్యూజిలాండ్-శ్రీలంక జట్ల మధ్య నిర్ణయాత్మకమైన మూడో టీ20 జరిగింది.ఈ మ్యాచ్‌లో న్యూజిలాండ్ 4 వికెట్ల తేడాతో గెలుపొంది, 3 మ్యాచ్‌ల సిరీస్‌ను 2-1 తేడాతో కైవసం చేసుకుంది. నరాలు తెగే ఉత్కంఠ నడుమ సాగిన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక.. నిర్ణీత ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 182 పరుగులు చేయగా.. న్యూజిలాండ్ మరో బంతి మిగిల్చి లక్ష్యాన్ని చేరుకుంది (19.5 ఓవర్లలో 183/6).న్యూజిలాండ్ గెలుపుకు ఆఖరి ఓవర్‌లో 10 పరుగులు అవసరం కాగా.. చాప్‌మన్ తొలి బంతికే సిక్సర్ కొట్టి లక్ష్యానికి చేరువ చేసినప్పటికీ.. కివీస్ మరుసటి 3 బంతులకు 3 వికెట్లు కోల్పోయి ఒత్తిడిలో పడిపోయింది. అయితే 19వ ఓవర్ ఐదో బంతికి రచిన్ రవీంద్ర 2 పరుగులు తీయడంతో న్యూజిలాండ్ మ్యాచ్‌తో పాటు సిరీస్‌ను కూడా కైవసం చేసుకుంది.ఇదిలా ఉంటే, ఈ మ్యాచ్‌లో శ్రీలంక బ్యాటింగ్ సందర్భంగా ఓ ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. లంక బ్యాటర్లు తమ ఇన్నింగ్స్‌ను కొనసాగిస్తుండగానే, ఇంచుమించు చేతికందేంత ఎత్తులో ఓ విమానం? టేకాఫ్ అయ్యింది. ఇది పెద్దగా పట్టించుకోకుండా ఆటగాళ్లు ఆటను కొనసాగించగా.. మైదానంలో ఉన్న ప్రేక్షకులు ఏమాత్రం బెరుకు లేకుండా ఆటను ఆస్వాధిస్తూ కనిపించారు.విమానం మ్యాచ్ మధ్యలో టేకాఫ్ అవుతున్న దృశ్యం సోషల్‌మీడియాలో వైరలవగా.. విషయం తెలియని వారు రకరకాలుగా ఊహించుకుంటున్నారు. జనాలకు ఇంత దగ్గరలో విమానాలు వెళితే ఎంత ప్రమాదమని కొందరంటుంటే, ఇంకొందరేమో ఇది కెమెరా ట్రిక్ అని లైట్‌గా తీసుకుంటున్నారు. వాస్తవ విషయం ఏంటంటే, జాన్ డేవిస్ మైదానం పక్కనే ఎయిర్‌పోర్ట్ రన్‌వే ఉంది. అనునిత్యం ఇక్కడి నుంచి విమానాలు టేకాఫ్ అవుతుంటాయి. గతంలో చాలా సందర్భాల్లో మ్యాచ్‌లు జరుగుతుండగా విమానలు టేకాఫ్ అయ్యాయి.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190